రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# కాంగ్రెస్సే హీరో



**పురపోరులో ప్రభంజనం**

**రంగారెడ్డి జిల్లాలో నాలుగు చోట్ల విజయ ఢంకా**

**చేవెళ్ల, మొయినాబాద్, షాద్‌నగర్, శంకర్‌పల్లిలో హస్తం హవా**

**ఇబ్రహీంపట్నం, ఆమన్‌గల్లులో బిఆర్ఎస్ విజయం**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించింది. మున్సిపల్ ఎన్నికలలో అత్యధికంగా అధికారపార్టీ అభ్యర్థులు ఆధిపత్యాన్ని సాధించారు. రంగారెడ్డి జిల్లాలో ఆరు మున్సిపాలిటీలకు గాను నాలుగు కాంగ్రెస్ కైవసమవ్వగా.. బిఆర్ఎస్ ఇబ్రహీంపట్నం, ఆమన్‌గల్‌లలో మెజార్టీ సాధించింది. చేవెళ్ల, మొయినాబాద్, షాద్‌నగర్, శంకర్‌పల్లి మున్సిపాల్టీలు కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. షాద్‌నగర్ మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులు ఉండగా కాంగ్రెస్ 15 స్థానాలను గెలుచుకుంది. టిఆర్ఎస్ 11 స్థానాలు గెలుచుకుంది మరొక స్థానం స్వతంత్ర అభ్యర్థి ఇంకో స్థానం బిజెపి అభ్యర్థి మరొకరు ఇండిపెండెంట్ విజయం సాధించారు. చేవెళ్లలో మొత్తం 18 వార్డులు ఉండగా 11 కాంగ్రెస్, టిఆర్ఎస్ నాలుగు, బిజెపి మూడు వార్డుల్లో గెలుపొందాయి. శంకర్‌పల్లి మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులు ఉండగా కాంగ్రెస్ 9, బిఆర్ఎస్ నాలుగు, ఇండిపెండెంట్లు రెండు వార్డులలో విజయకేతనం ఎగురవేశారు. మొయినాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 17 వార్డులకు గాను కాంగ్రెస్ ఎనిమిది చోట్ల.. టిఆర్ఎస్ నాలుగు, బిజెపి 2, ఇండిపెండెంట్లు మూడు వార్డులలో సత్తా చాటారు. చేవెళ్ల మున్సిపాలిటీలో మొత్తం 18 వార్డులు ఉండగా కాంగ్రెస్ 11, టిఆర్ఎస్ నాలుగు, బిజెపి మూడు వార్డులు సొంతం చేసుకున్నాయి. కారు జోరు సాగించిన ఆమనగల్ మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులు ఉండగా బిఆర్ఎస్ 8 స్థానాలు కైవసం చేసుకోగా.. కాంగ్రెస్ ఒక స్థానానికే పరిమితమవ్వగా బిజెపి 6 స్థానాలు దక్కించుకుంది. ఇబ్రహీంపట్నంలో మొత్తం 24 వార్డులకు గానూ 13 వార్డులు బిఆర్ఎస్ సొంతం చేసుకోగా, 8 వార్డులు కాంగ్రెస్, బిజెపి 2, ఇండిపెండెంట్ 1 సొంతం చేసుకుంది.

**ఫలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యూహాలు..**

మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియ మొత్తానికి పూర్తయింది.. 15 స్థానాల్లో సత్తా చాటి కాంగ్రెస్ మున్సిపల్ పీఠాన్ని సొంతం చేసుకుంది. మరోవైపు బీఆర్ ఎస్ కూడా గట్టి పోటీ ఇచ్చి మున్సిపాలిటీలో తన ఆధిపత్యాన్ని చాటుకుంది. బిజెపి గత మూడు ఎన్నికల్లో మొదటిసారిగా ఖాతా తెరిచింది. బీఆర్ఎస్ టికెట్



షాద్‌నగర్‌లో విజేతలతో ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే తదితర సీనియర్ నేతల సంబరాలు

# వికారాబాద్ 'హస్త'గతం

## మ్యాజిక్ ఫిగర్‌ను సాధించుకున్న కాంగ్రెస్

## మున్సిపాల్టీ పగ్గాలు పట్టనున్న స్పీకర్ కుమార్తె గడ్డం అనన్య

**వికారాబాద్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా కొనసాగింది. మున్సిపల్ చైర్మన్ కుర్చీ కాంగ్రెస్ కైవసం చేసుకోనుంది. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూతురు గడ్డం అనన్య చైర్మన్ పీఠం అధిరోహించనుంది. వికారాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ బుధవారం ముగియడంతో శుక్రవారం ఫలితాలు వెలువడ్డాయి. మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకోగా, ద్వితీయ శ్రేణిలో బీఆర్ఎస్, తృతీయ శ్రేణిలో బీజేపీ పార్టీల అభ్యర్థులు గెలుపొందారు. వికారాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 34 వార్డులు ఉండగా, 2 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. 1వ వార్డు అభ్యర్థి పట్లొళ్ళ అనంత్‌రెడ్డి ఏకగ్రీవం కాగా, 15వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి పి.విజయలక్ష్మీ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. బీఆర్ఎస్ అభ్యర్థి విజయలక్ష్మీ ఏకగ్రీవం అయిన మరుసటి రోజునే కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో, ఎన్నికల పోలింగ్ కు ముందే కాంగ్రెస్ ఖాతాలో 2 స్థానాలు కైవసం చేసుకుంది. మిగతా 32 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 16 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందగా, 10 స్థానాలు బీఆర్ఎస్, 4 స్థానాలు బీజేపీ, ఏఐఎంఐఎం 1, స్వతంత్ర అభ్యర్థి 1 స్థానాలను మిగతా 2లో



ఫలితాల అనంతరం మీడియాతో మాట్లాడుతున్న చైర్మన్ అభ్యర్థి గడ్డం అనన్య

### ఇది ప్రజా విజయం: అనన్య

ఈ విజయం ప్రజా విజయం అని, తన తండ్రిని ఆశీర్వదించి అసెంబ్లీ స్పీకర్‌ను చేశారని, తనను ఆశీర్వదించి మున్సిపల్ చైర్మన్ ను చేస్తున్నందుకు తాను వికారాబాద్ ప్రజలకు రుణపడి ఉంటానని చైర్మన్ అభ్యర్థి గడ్డం అనన్య మీడియా ముఖంగా తెలిపారు. ఎవరూ ఊహించని రీతిలో వికారాబాద్ పట్టణాన్ని అభివృద్ధి పరుస్తానని హామీ ఇచ్చారు. ఇక నుంచి ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాని అన్నారు. తన గెలుపునకు సహకరించిన కాంగ్రెస్ శ్రేణులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## రహస్య ప్రాంతానికి బిఆర్ఎస్ కౌన్సిలర్లు

**ఆమనగల్లు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికల్లో విజయం సాధించిన బిఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లు శుక్రవారం రహస్య ప్రాంతానికి తరలి వెళ్లినట్లు తెలుస్తోంది. 15 వార్డులలో 8 వార్డులను కైవసం చేసుకున్న బారాస, చైర్మన్ పదవికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ కు లైన్ పైనే ఉండడంతో ముందస్తు జాగ్రత్తగా వీరంతా రహస్య ప్రాంతానికి విహారయాత్రగా వెళ్లినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ చైర్మన్ పదవి ఎంపిక ఈ నెల 16న జరగనున్న నేపథ్యంలో బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లు ప్రలోభాలకు గురికాకుండా ఆ పార్టీ స్టార్ కాంపైనర్ పాపిశెట్టి రాము నేతృత్వంలో గెలుపొందిన 8 మంది కౌన్సిలర్లు క్యాంపుకు తరలినట్లు తెలుస్తోంది. ఆమనగల్లు మున్సిపాలిటి ఎన్నికల్లో బిఆర్ఎస్ కారు దూసుకుపోయింది. 15వార్డులలో 8 స్థానాలను కైవసం చేసుకుని మ్యాజిక్ ఫిగర్ అధిగమించింది. గత పాలకపక్షం బిజెపి గట్టిపోటి ఇచ్చి 6 వార్డులను కైవసం చేసుకుని మరోసారి తమ సత్తా చాటింది. కాగా అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం పూర్తిగా చతికిలపడిపోయింది. ఒకేఒక్క స్థానంతో సరిపెట్టుకుంది. దీంతో బిఆర్ఎస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రావడంతో దీంతో మున్సిపాలిటీ చైర్మన్ పదవికి అర్హత సాధించింది. బుధవారం ఆమనగల్లు పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో కౌంటింగ్ ఏర్పాటు చేశారు. 5వార్డులకు ఒక రౌండ్ చొప్పున 3 రౌండ్లు చేపట్టి ఫలితాలను రాబట్టారు. పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు మూడంచల బందోబస్తును ఏర్పాటు చేశారు. మిగతా 2లో



బిఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి పాపిశెట్టి రాము విజయంతో కార్యకర్తల ఆనందోత్సాహం

# ఇండిపెండెంట్‌లే కీలకం

## పరిగి మున్సిపాల్టీలో హంగ్

### కాంగ్రెస్ - 8, బిఆర్ఎస్ - 8, స్వతంత్రులు- 2

### స్వతంత్రుల మద్దతు కోసం కాంగ్రెస్, బిఆర్ఎస్ ఆరాటం

**పరిగి ఫిబ్రవరి13 ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల ఫలితాలలో వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపాలిటీలో ఫలితాలు ఆద్యాంతం ఉత్కంఠ భరితంగా నువ్వా నేనా అన్నట్టు ఫలితాలొచ్చాయి.. మొదటి రౌండ్ నుండి కాంగ్రెస్,బిఆర్ఎస్ అభ్యర్థుల మధ్య హోరాహోరీగా పోటీ నెలకొంది.. 18 వార్డుల్లో జరిగిన కౌన్సిలర్ ఎన్నికలల్లో లెక్కింపు పూర్తయ్యే సరికి కాంగ్రెస్ 8, బిఆర్ఎస్ 8, స్వతంత్రులు 2 , కౌన్సిలర్ స్థానాలు కైవసం చేసుకున్నారు. చైర్ పర్సన్ పీఠం దక్కాలంటే రావాల్సిన మేజిక్ ఫిగర్ ఏ పార్టీకి రాకపోవడంతో పరిగి మున్సిపల్ లో హంగ్ ఏర్పడింది. .అయితే మూడో రౌండ్ ముగిసేవరకు చెరో ఎనిమిది స్థానాలు కాంగ్రెస్ ,బిఆర్ఎస్ పార్టీలకు రావడంతో 3 వవార్డులో స్వతంత్రంగా గెలిచిన హనుమంతును లాక్కెల్లేందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్ వర్గీయులు ప్రయత్నించారు..స్వతంత్ర అభ్యర్థి హనుమంతు కౌంటింగ్ కేంద్రం వద్ద మాట్లాడుతూ ..తనను గెలిపించిన వార్డు ప్రజలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని, నజీరాబాద్ వార్డుఅభివృద్ధికి ఎవరైతే , సహకరించి ఎక్కువ నిధులు ఇచ్చే వారికే తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.లెక్కింపు కేంద్రం వద్ద అభ్యర్థిని బయటకు పంపాలంటూ కొద్దిపాటి ఆందోళనలు చేశారు..హంగ్ ఏర్పడటంతో స్వతంత్రులు మద్దుతు తప్పనిసరి అవ్వడంతో స్వతంత్రుల మద్దతు కోరేందుకు బిఆర్ఎస్,కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు.ఊహించినట్టుగానే పరిగి పోరు రసవత్తరంగానే జరిగిన మున్సిపల్ పీఠం దక్కే అదృష్టం ఎవరిదనేది వేచి చూడాల్సిందే..బిజెపి పార్టీ అభ్యర్థులు విజయాలలో ఖాతా కూడా తెరువలేదు.

పరిగి మున్సిపల్ ఎన్నికల్లోగెలుపొందిన అభ్యర్థుల వివరాలు.

1వవార్డులో 29 ఓట్ల మెజారిటీతో ఇండిపెండెంట్ అభ్యర్థి అక్కమ్మ ,2వ వార్డులో 50 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి ఆరిఫ్, 3వ వార్డులో 159 ఓట్ల మెజారిటీతో స్వతంత్ర అభ్యర్థి హనుమంతు, 4వ వార్డులో 304 ఓట్ల మెజారిటీతో బిఆర్ఎస్ అభ్యర్థి శివనోళ్ల చంద్రకళ ,5వవార్డులో 102 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి షాహెదాబేగం,6వ వార్డులో 626 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి యూసూఫ్,7వ వార్డులో 46 ఓట్ల మెజారిటీతో బిఆర్ఎస్ అభ్యర్థి సునీత, 8వ వార్డులో 8ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి హబీబున్నిసా,9 వవార్డు 45 ఓట్ల మెజారిటీతొ కాంగ్రెస్ అభ్యర్థి లక్షీ ్మ ,10వవార్డు లో 167 ఓట్ల మెజార్టీతో బిఆర్ఎస్ అభ్యర్థి బి రవికుమార్, 11 వవార్డులో 326 మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి ఎజాజ్,12 వవార్డులో 84 ఓట్ల మెజారిటీతో బిఆర్ఎస్ అభ్యర్థి రవీంద్ర, 13వ వార్డులో 220 ఓట్ల మెజారిటీతో బిఆర్ఎస్ అభ్యర్థి సమీనా బేగం, 14వవార్డులో 14 ఓట్ల మెజారిటితో బిఆర్ఎస్ అభ్యర్థి ఆనెం సరిత,15వవార్డులో 194 ఓట్ల మెజారిటీతొ బిఆర్ఎస్ అభ్యర్థి శ్రీనివాస్ ,16వ వార్డు 97 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి కుడుముల రజిత 17వవార్డులో 18 ఓట్ల మెజారిటీతో అఖిల ,18వవార్డులో 21 ఓట్ల మెజారిటీతో బిఆర్ఎస్ అభ్యర్థి నరేష్ లు కౌన్సిలర్లుగా గెలుపొందారు.



విజేతగా నిలిచిన పరిగి 3వ వార్డు స్వతంత్ర అభ్యర్థి హనుమంతు




గెలుపొందిన అభ్యర్థులకు ధృవ పత్రాలు అందజేస్తున్న అధికారులు

## తాండూరులో కారు దూకుడుకు బ్రేక్

### మూడు స్థానాలతో సరిపెట్టుకున్న బిజెపి

### ఒక్కొ స్థానంతో ఎంఐఎం, ఇండిపెండెంట్

**తాండూరు, జనవరి 13, ప్రభాతవార్త :** తాండూరు మున్సిపల్ ఎన్నికల్లో హస్తం హవా కొనసాగింది. 'కారు' స్పీడుకు చేయి కళ్లెం వేసింది. పట్టణంలోని 36 వార్డులలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను దక్కించుకుంది. 19 వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. బిఆర్ఎస్ 12స్థానాలు గెలుపొందగా.. 'కమల' దళం మూడు స్థానాలతోనే సరిపెట్టుకుంది. ఒక స్థానంలో ఎంఐఎం, మరో స్థానంలో ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు తమయే అంటూ అధికార కాంగ్రెస్‌తో పాటు బిఆర్ఎస్ పార్టీలు ధీమాలో ఉన్నా.. బిఆర్ఎస్‌కు గట్టి జలక్ తగిలింది. మెజార్టీ స్థానాలు కూడ సాధించుకోలేక పోయింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల్లో 11 వార్డు అభ్యర్థి బంటు వేణుగోపాల్ 909 ఓట్ల బంపర్ మెజార్టీ సాధించారు. పట్టణంలోని మొత్తం 36 వార్డులకు గాను 1వ వార్డులో దనసరి నాగలక్ష్మి (బిఆర్ఎస్) అభ్యర్థి 198 ఓట్ల మెజార్టీ, 2వ వార్డులో ప్రత్యూష మజ్‌దేవి (కాంగ్రెస్) 204 ఓట్ల మెజార్టీ, 3వ వార్డులో తయాబా సుల్తానా (కాంగ్రెస్) 72ఓట్ల మెజార్టీ, 4వ వార్డులో మేహర్ ఉన్నీసా బేగం (కాంగ్రెస్) 36 ఓట్ల మెజార్టీ, 5వ వార్డులో జీనత్ బేగం (స్వతంత్ర) 92ఓట్ల మెజార్టీ, మిగతా 2లో

## కొడంగల్‌లో కాంగ్రెస్ ప్రభంజనం

### కాంగ్రెస్ 10-బిఆర్ఎస్ 1 - ఎంఐఎం 1

### - క్యాంపునకు తరలిన కాంగ్రెస్ అభ్యర్థులు

**కొడంగల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** కొడంగల్ మున్సిపాలిటీ హస్తగతమైంది. కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డులకు గాను ఈనెల 11న ఎన్నికలు జరిగాయి. శుక్రవారం స్దానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఉదయం 8 గంటలకు కౌంటింగ్‌ను ప్రారంబించారు. మొత్తం 12 వార్డులకు గాను 10 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్డులు విజయం సాధించారు. ఒక వార్డులో బీఆర్ఎస్, మరో వార్డులో ఎంఐఎం పార్టీ అభ్యర్డులు గెలుపొందారు. విజయం సాధించిన వారి వివరాల్లోకి వెళితే..మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో జగదీశ్వర్‌రెడ్డి(కాంగ్రేస్) 439 ఓట్లు సాధించి ప్రత్యర్ది ఎంఐఎం పార్టీ అభ్యర్దిపై 149 ఓట్లు మెజార్టీతో విజయం సధించారు. అలాగే 2వ వార్డులో వాణీశ్రీ(బీఆర్ఎస్) 405 ఓట్లు సాధించి 51 ఓట్ల తేదాతో గెలుపొందారు. అలాగే 3వ వార్డులో గొల్ల లక్ష్మమ్మ(కాంగ్రేస్)504 ఓట్లు సాధించి ప్రత్యర్ది బీఆర్ఎస్ పార్టీ అభ్యర్దిపై 186 ఓట్లు తేడాతో విజయం సాధించారు. అలాగే 4వ వార్డులో నందారం ప్రశాంత్(కాంగ్రేస్)492 ఓట్లు సాధించి 291 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. 5వ వార్డులో బాలమ్మ(కాంగ్రేస్) 386 ఓట్లు మిగతా 2లో



సిఎం సోదరుడు తిరుపతిరెడ్డిని కలిసిన కాంగ్రెస్ విజేతలు

# అలియాబాద్‌లో ఉత్కంఠ

### కాంగ్రెస్‌కు 8, బిఆర్ఎస్‌కు 7, బిజెపికి-3, బిఎస్‌పికి-1, ఇండిపెండెంట్-1

### చైర్మన్ పదవి కోసం క్యాంపులకు తరలిన విజేతలు

**శామీర్‌పేట,(మేడ్చల్ జిల్లా ప్రతినిధి), ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** అలియాబాద్ మున్సిపాల్టీ ఎన్నికల్లో వార్డుల ఫలితాలు ఉత్కంఠభరితంగా రావటం ఏ పార్టీకి మెజార్టీ స్థానాలు రాకపోవటంతో బిఎస్‌పి అభ్యర్థిని కాంగ్రెస్ వారు క్యాంపునకు తరలించే యత్నంలో కొంత సేపు ఉద్రిక్తత చోటు చేసుకుని, పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేసే పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి ఉద్రిక్తంగ మారటంతో పోలీసులు రంగంలోకి దిగి కౌంటింగ్ సెంటర్ బయట ఉన్న వారిని లాఠీచార్జి చేస్తూ తరలించారు. అయితే చైర్మన్ పదవి ఎవరికి దక్కేనో అని ఇటు కాంగ్రెస్ పార్టీలో, అటు బిఆర్ఎస్ పార్టీలో చర్చనీయాంశంగ మారింది. ఈ మున్సిపాల్టీలో 20వార్డులు ఉండగా ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి 8స్థానాలు, బిఆర్ఎస్ పార్టీకి 7స్థానాలు, బిజెపి పార్టీకి 3స్థానాలు, ఒకటి బిఎస్‌పి, ఒకటి ఇండిపెండెంట్ అభ్యర్థులు గెలుపొందారు. అయితే గెలుపొందిన వారిలో ఒకరు బిఎస్‌పి, మరొకరు ఇండిపెండెంట్ గెలుపొందటంతో మిగతా 2లో



బిఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి వనజ శ్రీనివాస్‌రెడ్డికి ధృవ పత్రాన్ని అందజేస్తున్న కమిషనర్

## కౌంటింగ్ కేంద్రం వద్ద గందరగోళం

**ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిపై విరుచుకుపడిన బిఆర్ఎస్ నేతలు**

**కాంగ్రెస్ నేతలపై దాడి చేసేందుకు యత్నం..** 2



ఎమ్మెల్యేపై దాడి చేసేందుకు యత్నిస్తున్న బిఆర్ఎస్ నేతలు

## మూడుచింతలపల్లిలో బిఆర్ఎస్ హవా..

**శామీర్‌పేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో మెజార్టీ స్థానాల్లో బిఆర్ఎస్ విజయం సాధించింది. మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో 24స్థానాలు ఉండగా, ఫలితాల్లో బిఆర్ఎస్-14, కాంగ్రెస్-9, బిజెపి-1 స్థానాల్లో ఆయా పార్టీల అభ్యర్థులు విజయం సాధించారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీకి సంబంధించి ఓట్ల లెక్కింపు జగ్గంగూడలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో జరిగింది. మున్సిపాల్టీల్లో 24వార్డులు ఉండగా వీటిలో గెలుపొందిన వారి వివరాలు పార్టీల వారీగ ఇలా ఉన్నాయి. 1వవార్డులో ముద్దం పాపిరెడ్డి(కాంగ్రెస్), 2ద వార్డులో వంగ ప్రియాంక(బిజెపి), 3వ వార్డులో గండి శ్రావణి(కాంగ్రెస్), 4వ వార్డులో జాము రవి(బిఆర్ఎస్), 5వ వార్డులో మిగతా 2లో

## తాండూరులో కారు దూకుడుకు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

6వ వార్డులో అనిల్ కుమార్ (బిఆర్ఎస్) 98 ఓట్ల మెజార్టీ, 7వ వార్డులో ఈర్షాద్ (బిఆర్ఎస్) 441 ఓట్ల మెజార్టీ, 8వ వార్డులో జావిద్ (బిఆర్ఎస్) 832 ఓట్ల మెజార్టీ, 9వ వార్డులో పట్లోళ్ల దీపా (బిఆర్ఎస్) 45 ఓట్ల మెజార్టీ, 10వ వార్డులో అల్లాపూర్ శ్రీకాంత్ (కాంగ్రెస్) 383 ఓట్ల మెజార్టీ, 11వ వార్డులో బంటు వేణుగోపాల్ (కాంగ్రెస్) 909 ఓట్ల మెజార్టీ, 12వ వార్డులో పట్లోళ్ల నీరజా (కాంగ్రెస్) 424 ఓట్ల మెజార్టీ, 13వ వార్డులో సురేష్ నాయక్ (బిఆర్ఎస్) 61 ఓట్ల మెజార్టీ, 14 వార్డులో మహియా అంజూమ్ (కాంగ్రెస్) 72 ఓట్ల మెజార్టీ. 15వ వార్డులో దివిటి ఎల్లప్ప (కాంగ్రెస్) 23 ఓట్ల మెజార్టీ, 16వ వార్డులో నారా శ్రీలత (కాంగ్రెస్) 243 ఓట్ల మెజార్టీ, 17వ వార్డులో సనా తబుస్సుమ్ (కాంగ్రెస్) 246 ఓట్ల మెజార్టీ, 18వ వార్డులో మోయిజ్ అహైద్ ఖాన్ (ఎంఐఎం) 33 ఓట్ల మెజార్టీ, 19వ వార్డులో జుంటుపల్లి వెంకట్ (కాంగ్రెస్) 31 ఓట్ల మెజార్టీ, 20వ వార్డులో నవీన (బీఆర్ఎస్) 97 ఓట్ల మెజార్టీ, 21 వార్డులో సభా ఫాతిమా (కాంగ్రెస్) 369 ఓట్ల మెజార్టీ, 22వ వార్డులో రామకృష్ణ (కాంగ్రెస్) 210 ఓట్ల మెజార్టీ, 23వ వార్డులో అంతారం కిరణ్ (బిజెపి) 291 ఓట్ల మెజార్టీ, 24వ వార్డులో బాలకృష్ణారెడ్డి (కాంగ్రెస్) 205 ఓట్ల మెజార్టీ, 25 వార్డులో నసీరా భాను (బీఆర్ఎస్) 420 ఓట్ల మెజార్టీ, 26 వార్డులో వైశాలి (కాంగ్రెస్) 363 ఓట్ల మెజార్టీ, 27వ వార్డులో ఉప్పరి స్వరూప (కాంగ్రెస్) 283 ఓట్ల మెజార్టీ, 28వ వార్డులో నాగారం మల్లేశం (బిజెపి) 119 ఓట్ల మెజార్టీ, 29వ వార్డులో అబ్దుల్ రజాక్ (కాంగ్రెస్) 468 ఓట్ల మెజార్టీ, 30వ వార్డులో మెహరాజ్ బేగం (కాంగ్రెస్) 36ఓట్ల మెజార్టీ, 31 వార్డులో యోగానంద్ (బిఆర్ఎస్) 239 ఓట్ల మెజార్టీ, 32వ వార్డులో ఉమా మహేశ్వరి (బిఆర్ఎస్) 290 ఓట్ల మెజార్టీ, 33 వార్డులో శ్రీకాంత్‌రెడ్డి (బిజెపి) 201 ఓట్ల మెజార్టీ, 34వ వార్డులో పటేల్ సుప్రీత (బిఆర్ఎస్) 203 ఓట్ల మెజార్టీ, 35 వార్డులో అప్సామైనా బేగం (కాంగ్రెస్) 39 ఓట్ల మెజార్టీ, 36వ వార్డులో రూపా పాటిల్ ( బిఆర్ఎస్) 350 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.



అగ్గనూరు బస్వం

### అగ్గనూరు బస్వం అందెమోహన్‌లలో ...

# ఛాన్స్ ఎవరికి..?

### షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ రేసులో ఇద్దరు
### చైర్మన్ సీటు సీనియారిటీకా .. యువతకా..?
### అధిష్టానం చేతిలో చైర్మన్ పదవి యువతకు ప్రాధాన్యత ఇస్తామన్న ఎమ్మెల్యే శంకర్



అందెమోహాన్

**షాద్‌నగర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ ఇక చైర్మన్ వైస్ చైర్మన్ పదవులను ఎవరికి అవకాశం కల్పిస్తారన్న ఉత్కంఠ పార్టీ వర్గాల్లో చెలరేగుతుంది. షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికలలో 28 వార్డులకు గాను 15 స్థానాలను కైవసం చేసుకున్న సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందని ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేత అగ్గనూరు బస్వం, మరో యువ నేత యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందెమోహన్ రేసులో ఉండడంతో చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందన్న సస్పెన్స్ కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన ఫలితాల వెల్లడి అనంతరం కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర పార్టీ ముఖ్య నేతలను కలిసి క్యాంపుకు బయలుదేరి వెళ్లారు. ఈ అంశంపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ తమ పార్టీ చైర్మన్ పదవి ఎంపిక వ్యవహారంలో స్థానికుల ఓటర్ల కార్యకర్తల అభిప్రాయం మేరకు అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని పార్టీకి ఒక పద్ధతి నియమం ఉంటుందని దాని ప్రకారమే చైర్మన్ పదవి ఎంపిక ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అయితే యువతకే మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున ఛాన్స్ ఇచ్చామని వారికే ఛాన్స్ ఇస్తామని చెప్పడం వెనుక కూడా కొంత ఆలోచన కొనసాగుతుంది. సీనియర్ నేత అగ్గనూరు బస్వం కుటుంబం గతంలో దశాబ్దాల పాటు ఈ ప్రాంతాన్ని సర్పంచ్ గా, మున్సిపల్ చైర్మన్ గా వారి కుటుంబ సభ్యులు పాలించిన సందర్భం ఉంది. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి దశాబ్దాలపాటు అంటిపెట్టుకొని ఉన్న చరిత్ర అందెమోహన్ కుటుంబానికి ఉంది. ఇప్పటివరకు అందెమోహన్ తాత వెంకయ్య, అందే బాలరాజు, అతని తండ్రి అదేవిధంగా సోదరుడు మొత్తం కుటుంబం కాంగ్రెస్ పార్టీలోనే దశాబ్దాలుగా కొనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని అధికారులు ఉన్న లేకపోయినా వారు అలాగే కొనసాగారు. మరోవైపు బస్సు కుటుంబం ఇటువైపు అందేమోహన్ కుటుంబం పార్టీని నమ్ముకుని ఉన్నారు. ఇందులో కేవలం బస్వం సోదరుడు మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం మాత్రం లోగడ టిఆర్ఎస్ పార్టీలోకి వెళ్లి తిరిగి పార్టీలోకి వచ్చారు. ఈ ఒక్క మైనస్ పాయింట్ తప్ప పార్టీపరంగా నిబద్ధత నిజాయితీపరంగా చూస్తే అందే మోహన్ సిన్సియారిటీకి సీనియార్టీ కి కూడా ఓ లెక్క ఉందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలో ఇబ్బందుల కాలంలో మాజీ చైర్మన్ విశ్వం కుటుంబ సభ్యులు టిఆర్ఎస్ పార్టీలో వలస వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. కానీ అగనూరు బస్వం మాత్రం పార్టీలోనే కొనసాగారు. బస్వం సిన్సియార్టీ కూడా ఆలోచించాలని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా అందేమోహన్ కు ఉన్న ప్లస్ పాయింట్ రాష్ట్రస్థాయిలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అదేవిధంగా పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా హార్దికంగా తట్టుకొని సేవలు అందించిన ఘనత ఉంది. ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఏ కార్యక్రమంలో సొంతంగా ఖర్చు చేసుకొని లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టుకున్న సందర్భంలో కూడా ఉన్నాయి.

ఏది ఏమైనప్పటికీ ఇద్దరిలోనే చైర్మన్ పదవి దోబూచులాట ఆడుతుందని ఒకవేళ యువర్ గాళ్లను అధిష్టానం సముదాయించి ఒకరికి చైర్మన్ పదవి మరొకరికి వైస్ చైర్మన్ పదవి ఇచ్చిన ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మొదటి నుండి ఈ ప్రాంతంలో మొదటి షాద్ నగర్ పాత మొదటి గ్రామం ఫరుక్ నగర్ కు ఎల్లవేళలా ఒక పదవి ఇస్తారు అదేవిధంగా పట్టణానికి మరో పదవి ఇస్తారు ఇలా రెండు ప్రాంతాలను గౌరవిస్తూ చైర్మన్ వైస్ చైర్మన్ పదవులు కూడా ఇస్తారు మరి ఆ విధంగా ఏమైనా అధిష్టానం ఆలోచిస్తుందా లేదా చూడాలి .

# కీసరగుట్టలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- గణపతి పూజ,యాగశాల ప్రవేశం
- ద్వజారోహణంతో పూజలు షురూ
-పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



కీసరగుట్టలో యాగశాలలో పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ వెంకటేశ్



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**కీసర,ఫిబ్రవరి13,ప్రభాతవార్త:** తెలంగాణాలోనే సుప్రసిద్ద శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ శివదుర్గా సమేత రామలింగేశ్వరస్వామి స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ జరిగింది.మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి,ఆలయ చైర్మన్ తటాకం వెంకటేశ్‌శర్మ,ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డి చేతుల మీదుగా విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.పుణ్యాహవచనం,రుత్విక్ వరణం అనంతరం యాగశాల ప్రవేశం చేసి ముక్కోటి దేవతలను ఆహ్వానించారు.అనంతరం అఖండ జోనయతి ప్రతిష్టాపనం,అగ్ని ప్రతిష్టాపన,భేరిపూజ,ద్వజారోహణం,ద్వాత్రింశతి రాగా లావన ,మంత్రపుష్పం,పరాకస్తవం తదితర పూజలు చేశారు.బ్రహ్మోత్సవాల్లో ఆరు రోజుల పాటు వైదిక కార్యక్రమాలు కీసరగుట్టలోని వేద పండితులు,విద్యార్దులు ఆద్వర్యంలో నిర్వహిస్తారు.బ్రహ్మోత్సవ పూజల్లో పాల్గొన్న వేద పండితులకు,విద్యార్దులకు పూజా వస్త్రాలను అందజేశారు.వేద పండితులు మార్తి సత్యనారాయణ శర్మ,గణపతి శర్మ బ్రహ్మోత్సవ విశేషాలను భక్తులకు వివరించారు.ప్రధాన అర్చకులు బలరామశర్మ,ఉప ప్రధాన అర్చకులు రవికుమార్‌శర్మ,అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



కీసరగుట్టలో గణపతి పూజ చేస్తున్న ఆలయ చైర్మన్ వెంకటేశ్ శర్మ

**స్వామి వారి సేవలో ఎమ్మెల్యే:**

కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి వారిని దర్శించుకున్నారు.ఆలయ వేద పండితులు ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.గర్భాలయంలోని మూలవిరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ అర్చకులు మహా మండపంలో వారికి తీర్ద ప్రసాదాలు,ఆశీర్వచనం అందజేశారు.

**నేడు స్వామి వారి కళ్యాణం :**

మహశివరాత్రి పర్వదినానికి ముందు రోజు రాత్రి శ్రీ భవానీ శివదుర్గా సమేత రామలింగేశ్వరస్వామికి కళ్యాణం అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం సాంప్రదాయంగా వస్తుంది.శనివారం రాత్రి 10 గంటలకు నిర్వహించే స్వామివారి కళ్యాణానికి దేవస్దానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

## కాంగ్రెస్ కు 11, బి ఆర్ ఎస్ నాలుగు, బిజెపి ఖాతాలో కి మూడు...

**ఊహించిన ఫలితాలే..**
**చైర్ పర్సన్ అభ్యర్థి దేవర సమత వెంకట్ రెడ్డి కి అత్యధిక మెజారిటీ**
**కౌటింగ్ కేంద్రం నుంచి చేవెళ్ల వెంకటేశ్వర్ల స్వామి దేవాలయం వరకు ర్యాలీ..**
**ఆలయం లో ప్రత్యేక పూజలు..**

**చేవెళ్ల, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** చేవెళ్ల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ముందే ఊహించినట్లుగానే ఫలితాలు వచ్చాయి. కాంగ్రెస్ కు 11, బీ ఆర్ ఎస్ కు నాలుగు, బీ జే పీ కి మూడు ఖాతాలో పడ్డాయి. చేవెళ్ల మున్సిపాలిటీ ఫలితాలు ఊహించినట్లుగనే రావడం తో అయా పార్టీ లు సంబురాలు లల్లో మునిగి పోయాయి. ఈ ఫలితాల్లో చైర్ పర్సన్ అభ్యర్థి దేవర సమత వెంకట్ రెడ్డి కి అత్యధిక మెజారిటీ సాధించారు. కౌటింగ్ కేంద్రం నుంచి చేవెళ్ల వెంకటేశ్వర్ల స్వామి దేవాలయం వరకు ర్యాలీలు..ఆలయం లో ప్రత్యేక పూజలు చేశారు. మొత్తం 18 వార్డు లకు సంబందించిన 59 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. మొదటి రౌడ్ లో 4 కాంగ్రెస్, 4 బీ ఆర్ ఏ స్ కు రాగ.. ఒకటి బీజేపీ దక్కించు కుంది. రౌండ్ లో ను ఆయా పార్టీల మద్య పోటా పోటీగా సాగింది. రౌండు లో మొదలైన 10 వార్డు నుండి18 వార్డు వరకు రెండో రౌండ్ కౌంటింగ్ మొదలయింది.. ఓట్ల లెక్కింపు ఉత్కంఠగా సాగుతున్నది. ఇందులో కూడా పార్టీ ల వారీగా చూసుకుంటే మొదటి రౌండు ఫలితలే పునరావృతం కావొచ్చని అంచనాలు వేశారు.

**చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో వార్డుల వారీగా ఇలా ఉన్నాయి**

1వ వార్డు లో దూత మల్లేష్ (253 ) ఓట్ల తో బీ ఆర్ ఎస్ గెలుపు.2వ వార్డు లో డప్పు సువర్ణ చందు 198 ఓట్లతో బీ ఆర్ ఎస్ గెలుపు3వ వార్డు కరికే మీనాక్షి 217 ఓట్ల మెజారిటీ తో బీజేపీ గెలుపు 4వ వార్డు బక్కరెడ్డి మాదవి 388 ఓట్ల తో కాంగ్రెస్ గెలుపు 5వ వార్డు దేవులపల్లి శ్రీనివాస్ రెడ్డి 126 ఓట్ల తో బీ ఆర్ ఎస్ గెలుపు 6వ వార్డు సోలిపురం సుచిత 13 ఓట్ల తో కాంగ్రెస్ గెలుపు7వ వార్డు కుర్వ మంగమ్మ 147 బీ ఆర్ ఎస్ ఓట్ల తో గెలుపు8వ వార్డు దావల్ గారి గోపాల్ రెడ్డి 317 ఓట్ల మెజారిటీ తో కాంగ్రెస్ గెలుపు9వ వార్డు తాళ్ల పల్లి నర్సింహు లు 106 ఓట్ల తో కాంగ్రెస్ గెలుపు10 వ వార్డు పెద్దోళ్ల దయాకర్ 200 ఓట్ల మెజారిటీ తో బీ జేపీ గెలుపు11వ వార్డు పైండ్ల మధుసూదన్ రెడ్డి 390 ఓట్ల తో కాంగ్రెస్ గెలుపు 12 వ దేవర మనీషా 13 ఓట్ల తో గెలుపు13 వ వార్డు రాములు గౌడ్ 411 ఓట్ల మెజారిటీ తో కాంగ్రెస్ గెలుపు 14వ వార్డు మద్దెల శ్రీనివాస్ 78 ఓట్ల మెజారిటీ తో కాంగ్రెస్ గెలుపు 15 వ వార్డు శైలజ ఆగిరెడ్డి 333 ఓట్ల మెజారిటీ కాంగ్రెస్ గెలుపు 16 వ వార్డు దేవర సమత వెంకట్ రెడ్డి 707 ఓట్ల అత్యది క మెజారిటీ తో గెలుపు 17వ మూడవత్ కృష్ణ నాయక్ 374 ఓట్ల తో కాంగ్రెస్ గెలుపు 18 వ కళ్యాణి 93ఓట్లతో కాంగ్రెస్ గెలుపొందారు...టపాసుల మోత..చేవెళ్ల మున్సిపాలిటీ కౌటింగ్ కేంద్రం వద్ద నుంచి చేవెళ్ల పట్టణ కేంద్రం వరకు టపాసుల మోత మారు మోగింది. పెద్ద పెద్ద శబ్దాలతో.. భారీ ర్యాలీ లతో క్యాడర్ సంబురాలు చేసుకున్నారు.

## వికారాబాద్ హస్త గతం

(మొదటి పేజీ తరువాయి)

కైవసం చేసుకున్నారు. కాంగ్రెస్ ఏకగ్రీవం అయిన 1 స్థానాన్ని కలుపుకొంటే 17 స్థానాలు రాగా, బీఆర్ఎస్ నుంచి ఏకగ్రీవం అయిన అభ్యర్థి విజయలక్ష్మీ కాంగ్రెస్ లో చేరడంతో కాంగ్రెస్ స్థానాలు 18కి చేరాయి. స్వతంత్ర అభ్యర్థి మున్నూరు పుష్పలత సైతం కాంగ్రెస్‌లో చేరడంతో కాంగ్రెస్ 19 స్థానాలను కైవసం చేసుకుంది. మాజిక్ ఫిగర్‌ను దాటి కాంగ్రెస్‌కు స్థానాలు లభించడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గద్దం అనన్య కే చైర్మన్ పీఠం దక్కనుంది. దీంతో కాంగ్రెస్ శ్రేణుల ఆనందానికి అవదులు లేకుండా పోయింది. కూతురు గద్దం అనన్య వికారాబాద్ మున్సిపల్ ఎన్నికల బరిలో తొలిసారి రాజకీయ అరంగేట్రం చేసింది. మున్సిపల్ ఎన్నికల బరిలో చైర్మన్ అభ్యర్థిగా 17వ వార్డు నుంచి బరిలో దిగింది. ఎన్నికల ఫలితాల్లో అత్యధిక ఓట్లు గద్దం అనన్య కే రావడంతో అందరూ ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి అయిన గద్దం అనన్య కు 1138 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి తోళ్ల అనందకుమార్ కు 75 ఓట్లు, బీజేపీ అభ్యర్థి పి.దయాకర్ కు 81 ఓట్లు, సీపీఎం అభ్యర్థి ఎం.శోభరాని కి 27 ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థి దయాకర్‌పై 1057 ఓట్ల మెజార్టీ తో అనన్య గెలుపొందింది. దీంతో అనన్య మున్సిపల్ చైర్మన్ పదవి అధిరోహించనుండటంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు. అనన్య కు దారి పొడగునా ఘన స్వాగతం పలికారు.

## కౌంటింగ్ కేంద్రం వద్ద గందరగోళం ..

**తాండూరు, జనవరి 13, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని సెంట్ మార్క్స్ హైస్కూల్‌లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద గందరగోళం నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో పాటు ఆయన వర్గీయులు విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యేపై దాడి చేసేందకు యత్నించారు. దీంతో కౌంటింగ్ కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్తంగా మారింది. శుక్రవారం సాయంత్రం మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ పూర్తి కావస్తున్న సమయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కౌంటింగ్ కేంద్రం వద్దకు వచ్చారు. కౌంటింగ్ కేంద్రంలోని మీడియా పాయింట్ వద్దకు వచ్చి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ మెజార్టీ అభ్యర్థుల గెలుపుపై సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కౌంటింగ్ కేంద్రానికి వచ్చిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఆయన వర్గీయులు, బిఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎమ్మెల్యేను ఎలా అనుమతిస్తారంటూ పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. తాండూరు డిఎస్పీ, నర్సింగ్ యాదయ్య, పట్టణ, రూరల్ సీఐలు సంతోష్‌కుమార్, ప్రవీణ్ కుమార్‌లు సిబ్బందితో గేట్ వద్దకు చేరుకొని వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. మీరు కూడా మీడియా పాయింట్ వరకు వెళ్లేందుకు అనుమతిస్తామంటూ నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు.

## శంకర్‌పల్లి మున్సిపల్ ఎన్నికల ఫలితాలు

**శంకర్‌పల్లి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** శంకర్‌పల్లి మున్సిపల్ ఎన్నికల ఫలితాలుకాంగ్రెస్ : 09టిఆర్ఎస్ : 04బీజేపీ: 00స్వతంత్ర : 02మొత్తం: 151వార్డ్ కాంగ్రెస్ పార్టీ (ఆనంద్ రావు )87 మెజార్టీ2 వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థి (బిసోళ్ళ సంధ్యారాణి అశోక్)133 3వార్డ్ కాంగ్రెస్ (బంద గిరిజ)4 వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థి (మానికొండ లలిత మోహన్ రెడ్డి)748 మెజార్టీ5వార్డ్ టిఆర్ఎస్ అభ్యర్థి (బానూరు కృ 6వార్డు టిఆర్ఎస్ (వన్నె పాగ ఉషా కిరణ్) 1077వార్డ్ టిఆర్ఎస్ (బండ్ల గూడెం ప్రశాంత్ )193 మెజార్టీ 8 వార్డ్ స్వతంత్ర అభ్యర్థి (టీచర్ అఖిల యాదవ రెడ్డి)167 మెజార్టీ9వార్డ్ కాంగ్రెస్ (వాకాంటోళ్ల గణేష్)36810వార్డ్ టిఆర్ఎస్ అభ్యర్థి(రాజండ్ల వసంత మహేందర్ రెడ్డి)4211వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థి( ఫైము ద బేగం)69 12వార్డ్ కాంగ్రెస్ (దండు రాజేశ్వర్)321 మెజార్టీ13వార్డ్ స్వతంత్ర అభ్యర్థి (చాకలి అశోక్)141 మెజార్టీ14వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థి (జూలకంటి శ్వేతా పాండురంగ రెడ్డి)2915వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థి( సాతా ప్రవీణ్ కుమార్)162

## కొడంగల్‌లో కాంగ్రెస్ ప్రభంజనం

(మొదటి పేజీ తరువాయి)

సాధించి బీఆర్ఎస్ అభ్యర్థిపై 127 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.6వ వార్డులో సయ్యద్ ఆమీద్ అలీ(కాంగ్రెస్) 343 ఓట్లు సాధించి ప్రత్యర్థి పార్టీ అభ్యర్థిపై 199 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.7వ వార్డులో కృష్ణంరాజు(కాంగ్రెస్) 795 ఓట్లు సాధించి ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థిపై 591 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.8వ వార్డులో ఎం.శంకర్‌నాయక్(కాంగ్రెస్) 246 ఓట్లు సాధించి ప్రత్యర్థి అభ్యర్థిపై 25 ఓట్ల తేడాతో విజయం సాధించారు.9వ వార్డులో సనా అఫ్రీనా(ఎంఐఎం)302 ఓట్లు సాధించి ప్రత్యర్థిపై 27 ఓట్ల తేడాతో విజయం సాధించారు.10వ వార్డులో కుషగారి రాజశేఖర్(కాంగ్రెస్) 440 ఓట్లు సాధించి ప్రత్యర్థి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిపై 304 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.11వ వార్డులో బత్తుల అనిత(కాంగ్రెస్) 495 ఓట్లు సాధించి ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థిపై 370 ఓట్ల తేడాతో విజయం సాధించారు.12వ వార్డులో ఎస్.సుష్మ(కాంగ్రెస్) 341 ఓట్లు సాధించి ప్రత్యర్థిపై 133 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు.విజయం సాధించిన అభ్యర్థులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ధృవపత్రాలను అందించారు.ఇదిలావుండగా ఎన్నికల కౌంటింగ్ కేంద్రం దగ్గర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు మూడంచల భద్రతను ఏర్పాటు చేశారు.కౌంటింగ్ ప్రక్రియను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా స్వయంగా పర్యవేక్షించారు.

## రహస్య ప్రాంతానికి బిఆర్ఎస్ కౌన్సిలర్లు

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 8 గంటల నుండి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించి మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కించారు. 21 ఓట్లకు గాను కాంగ్రేస్9, బిజెపి7, బిఆర్ఎస్ 5 ఓట్లు సాధించాయి. అలాగే మొదటి రౌండ్‌లో 1వార్డు నుండి 5 వార్డు వరకు బ్యాలెట్ పేపర్లను లెక్కించారు. రెండవ రౌండ్‌లో 6 నుండి 10, మూడవ రౌండ్‌లో 11 నుండి 15 వరకు ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించారు. మొదటి రౌండ్‌లో బిఆర్ఎస్ ఆధిక్యత ప్రదర్శించి మూడు స్థానాలు కైవసం చేసుకోగా. బిజెపి రెండు స్థానాలతో పోటి ఇచ్చింది. రెండవ రౌండ్‌లో బిఆర్ఎస్, బిజెపిలు చెరో రెండు స్థానాలను పంచుకోగా అధికార కాంగ్రేస్ పార్టీ ఒక స్థానంలో నిలిచింది. చివరి రౌండ్‌లో బిఆర్ఎస్ మూడు, బిజెపి రెండు స్థానాలు కైవసం చేసుకుంది. ఎన్నికల అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. విజేతల వివరాలు ఇలా ఉన్నాయి...1వవార్డు జాటావత్ ధోళి (బిజెపి),2వవార్డు కాలె యశోదమ్మ (బిఆర్ఎస్), 3వవార్డు తల్లోజు గీతాచారి (బిజెపి), 4వవార్డు దుడ్డు ఆంజనేయులు (బిఆర్ఎస్), 5.పాపిశెట్టి రామకృష్ణ (బిఆర్ఎస్) 6.నేనావత్ పత్యానాయక్ (బిఆర్ఎస్) 7.నేనావత్ నిరంజన్ (బిజెపి) 8.అనముల రమేశ్ (బిఆర్ఎస్) 9.ఎర్రవోలు మహేశ్ (బిజెపి)10.కోగూరు అనితశ్రీనివాస్‌రెడ్డి (కాంగ్రేస్) 11.నేనావత్ సునీత (బిజెపి) 12.నాగిళ్ళ జంగయ్య(జగన్) (బిఆర్ఎస్) 13.పుల్లారెడ్డి అనూష (బిఆర్ఎస్) 14.మొక్తాల వెంకటయ్య (బిజెపి) 15.ఎంగలి భాగ్యలక్ష్మీరఘు (బిఆర్ఎస్).

## కొడంగల్ పురపోరు ఫలితాలు ఇలా

**కొడంగల్,ఫిబ్రవరి 13ప్రభాతవార్త :** పురపోరులో కొన్ని ఆసక్తికరమైన అంశాలు చోటుచేసుకున్నాయి. కొందరు చదువుకోని ఓటర్లు తమకు తెలియక ఒకదానికి వేయాలని మరోదానికి ఓటు వేయడం జరుగుతుంది.కానీ కొడంగల్ పురపాలికలో ఉన్నత విద్యావంతులు సైతం ఓటు వేయడం రాక వారు వేసిన ఓట్లు చెల్లబాటు కాలేదు.మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో మొత్తం 1023 ఓట్లు ఉండగా 701 ఓట్లు పోలైయ్యాయి.ఇందులో 7 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదు కాగా అందవులో 4 ఓట్లు చెల్లుబాటు కాలేదు.పురపాలిక పరిధిలో 193 ఓట్లు చెల్లబాటు కాలేదు.మొత్తం 11,565 ఓట్లకుగాను 8,760 ఓట్లు పోలైయ్యాయి.ఇందులో 141 ఓట్లు రిజక్ట్ కాగా 52 ఓట్లు నోటాకు పడడంతో మొత్తంగా 193 ఓట్లు చెల్లుబాటు కాలేదు.

**తాత తరువాత మనువడు :** మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా 1975లో నందారం వెంకటయ్య పాలన కొనసాగించారు.అనంతరం మూడు సార్లు ఎమ్మెల్యేగా కొడంగల్‌కు ఎన్నికైయ్యారు.ఆ తరువాత ఎన్ని సార్లు ఆ కుటుంబం పోటీ చేసినా విజయం లభించలేదు.దాదాపు 50 సంవత్సరాల అనంతరం ఆయన మనువడు నందారం ప్రశాంత్ మొదటిసారి చైర్మేన్ అయ్యే అవకాశం లభించింది.ఇటీవల ప్రశాంత్ తండ్రి మృతి చెందిన 15 రోజులు మాత్రమే గడిచింది.తండ్రి దశదిన కర్మరోజు నామినేషన్ వేసి కంటతడి పెట్టుకున్నారు.తన తండ్రి లేదని ఈ రోజు తల్లివద్ద కంటతడి పెట్టుకున్నాడు.

## ఎల్లంపేట మున్సిపాలిటీ బీఆర్ఎస్ కైవసం

**మేడ్చల్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపాలిటీలో బీఆర్ఎస్ రెపరెపలాడింది. 24 వార్డులకు గాను 12 వార్డుల్లో గెలుపొంది అత్యధిక వార్డులు గెలిచిన పార్టీగా నిలిచింది. కాంగ్రెస్ 8 వార్డుల్లో, బీజేపీ 4 వార్డుల్లో గెలిచింది. 24 వార్డుల్లో 22581 మంది ఓటర్లు ఉండగా అందులో ఈ నెల 11న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 18805 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్‌కు 6416 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 6267 ఓట్లు, బీజేపీకి 3326 ఓట్లు వచ్చాయి.




ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయం

అందులో 1వ వార్డులో మామిండ్ల బాలమణి (కాంగ్రెస్), 2వ వార్డులో భూక్య శారధ నాయక్ (బీజేపీ), 3వ వార్డులో విజయలక్ష్మీ మాదవరెడ్డి (కాంగ్రెస్), 4వ వార్డులో పార్వతి తార్య నాయక్ (కాంగ్రెస్), 6వ వార్డులో మహేశ్వరీ (బీజేపీ), 7వ వార్డులో బందెల కుమార్ (బీఆర్ఎస్), 8వ వార్డులో లావుడియా శ్రీదేవి (బీఆర్ఎస్), 9వ వార్డులో మాలోత్ రజిత (బీఆర్ఎస్), 10 వ వార్డులో శ్రీలత (బీఆర్ఎస్), 11వ వార్డులో అఖిల (బీఆర్ఎస్), 12 వ వార్డులో కల్పన (బీఆర్ఎస్), 13వ వార్డు ముత్యాలు గౌడ్, (కాంగ్రెస్) 14వ వార్డులో విఘ్నేశ్వర్‌రెడ్డి (కాంగ్రెస్), 15వ వార్డులో వేణు గౌడ్ (కాంగ్రెస్), 16వ వార్డులో సురేష్‌రెడ్డి (బీఆర్ఎస్), 17వ వార్డులో దాది నర్సింహ (బీఆర్ఎస్), 18వ వార్డులో ఓం ప్రకాష్ గౌడ్, 19వ వార్డులో రజిత దేవేందర్‌రెడ్డి (బీజేపీ), 20వ వార్డులో వరలక్ష్మీ (బీఆర్ఎస్), 21వ వార్డులో భాస్కర్ (బీఆర్ఎస్), 22వ వార్డులో నిషితరెడ్డి (బీఆర్ఎస్), 23 వ వార్డులో హారీఫ్ (కాంగ్రెస్), 24వ వార్డులో అర్చన (బీజేపీ) అభ్యర్థులు విజయం సాధించారు. 12 స్థానాల్లో విజయం సాధించి మున్సిపాలిటీలో పాగా వేసింది.

## అలియాబాద్‌లో కీలకం

(మొదటి పేజీ తరువాయి)

వీరు కీలకంగా మారారు. బిజెపి నుంచి గెలిచిన ముగ్గురు కూడ కీలకంగ మారినట్లు చెప్పవచ్చు. శుక్రవారం అలియాబాద్ మున్సిపాల్టీలోని మజీద్‌పూర్‌లోని టి.చైతన్య హైస్కూల్‌లో ఓట్ల లెక్కింపు జరిగింది. ఈ మున్సిపాల్టీలో గెలుపొందిన వారు వార్డుల వారీగ వివరాలు ఇలా ఉన్నాయి. 1వ వార్డులో హపావత్ వెంకటేశ(బిఆర్ఎస్), 2వ వార్డులో గురుకుల దీప(కాంగ్రెస్),3వ వార్డులో దాసరి రవి(బిఆర్ఎస్), 4వవార్డులో ఎల్లు దీపిక(బిజెపి),5వ వార్డులో కన్‌రెడ్డి మాలతి(బిజెపి),6వ వార్డులో కైర గణేశ్(బిజెపి), 7వవార్డులో గాదె వెంకటేశ (ఇండిపెండెంట్), 8వ వార్డులో కంటం శిరీష అలియాస్ కంటం శ్వేత(కాంగ్రెస్),9వ వార్డులో వడగం యమున(బిఆర్ఎస్), 10వ వార్డులో సరసం వనజ(కాంగ్రెస్),11వ వార్డులో సామల జశ్వంత్‌రెడ్డి(కాంగ్రెస్),12వ వార్డులో లింగొల్ల హనుమాన్‌దాస్(బిఆర్ఎస్), 13వ వార్డులో మమ్మద్ యూసుఫ్‌బాబ(బిఆర్ఎస్), 14వ వార్డులో తలారి మౌనిక(కాంగ్రెస్),15వ వార్డులో తాళ్ల స్వప్న(కాంగ్రెస్), 16వ వార్డులో చీదు వనజ(బిఆర్ఎస్), 17వ వార్డులో ముద్దం సుదాకర్‌రెడ్డి(కాంగ్రెస్),18వ వార్డులో గూదె వెంకటేశ(బిఎస్‌పి), 19వ వార్డులో గుర్క కుమార్(బిఆర్ఎస్), 20వ వార్డులో మౌనిఖ వంగరి(కాంగ్రెస్)లు విజయం సాధించారు. అయితే ఈ నెల 16వ తేదీ చైర్మన్,వైస్‌చైర్మన్ ఎన్నిక ఉన్నందున అలియాబాద్ మున్సిపాల్టీలో చైర్మన్ పదవి కోసం పూర్తి స్థాయిలో కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలకు మెజార్టీ రాక పోవటంతో ఎన్నిక రసవత్తరంగ మారింది. కాంగ్రెస్ వారు ఒక బిఎస్‌పి, మరొక ఇండిపెండెంట్ అభ్యర్థులను క్యాంపునకు తరలించినట్లు వీరికి పది మంది ఉన్నట్లు స్పష్టం అవుతుంది. మరొకరు మెజార్టీ కోసం కావలసి ఉంటుంది. అయితే బిజెపి నుంచి ముగ్గురు అభ్యర్థులు గెలవటంతో వీరు కూడ కీలకంగ మారారు. మరీ బిజెపి బిఆర్ఎస్‌కు మద్దతు ఇస్తుందా లేక కాంగ్రెస్ పార్టీకి చేస్తుందా అనేది చర్చనీయాంశంగ మారింది. కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థిగా కంటం శిరీషకృష్ణారెడ్డి రంగంలో ముంద నుంచి ఉన్న సంగతి పార్టీ కూడ ప్రకటించిన సంగతి తెలిసిందే. మరీ బిఆర్ఎస్‌కు బిజెపి మద్దతు ఇచ్చినా మరొక అభ్యర్థి కావలసి ఉంటుంది. ఈ ఎన్నిక ఉత్కంఠభరితంగా మారింది. ఇప్పటికే కాంగ్రెస్, బిఆర్ఎస్‌పార్టీల వారు క్యాంపులకు గెలుపొందిన వారిని తరలించటం, అదే విధంగా బిజెపి వారు కూడ క్యాంపునకు వెళ్లినట్లు తెలుస్తుంది.

## మూడుచింతపల్లిలో బిఆర్ఎస్ హవా

(మొదటి పేజీ తరువాయి)

చిన్నలచ్చ సరిత(బిఆర్ఎస్), 6వ వార్డులో ర్యాకల నీరజ్‌గౌడ్(బిఆర్ఎస్), 7వ వార్డులో ముదావత్ నవీన్(బిఆర్ఎస్), 8వ వార్డులో దోసకాయల లత(కాంగ్రెస్), 9వ వార్డులో పెద్దిరెడ్డి శ్రీలత(కాంగ్రెస్), 10వ వార్డులో గోవర్ధన్‌రెడ్డి మెరుపాటి(కాంగ్రెస్), 11వ వార్డులో కొల్లాన్ రాజు(బిఆర్ఎస్), 12వ వార్డులో మేడబోయిన మౌనిక(బిఆర్ఎస్), 13వ వార్డులో చందుపట్ల విష్ణువర్ధన్‌రెడ్డి(బిఆర్ఎస్), 14వ వార్డులో గూడ జంగారెడ్డి(బిఆర్ఎస్), 15వ వార్డులో ఇర్రి స్వప్న(కాంగ్రెస్), 16వ వార్డులో మొరుగుబాయి శశిరేఖ(బిఆర్ఎస్), 17వ వార్డులో గుండ్లపల్లి మహేశ్వరి(బిఆర్ఎస్), 18వ వార్డులో గిరిపల్లి జ్యోతి(బిఆర్ఎస్), 19వ వార్డులో గిరిపల్లి రమేశ్(బిఆర్ఎస్), 20వ వార్డులో బొమ్మలపల్లి మల్లేశ్(కాంగ్రెస్), 21వ వార్డులో జిలకర లత(కాంగ్రెస్), 22వ వార్డులో ఆది అజయ్‌కుమార్(బిఆర్ఎస్), 23వ వార్డులో పుల్లి ప్రభాకర్ (కాంగ్రెస్), 24వ వార్డులో కొంపల్లి మాదవి(బిఆర్ఎస్)లు గెలుపొందారు. ఆయా అభ్యర్థులు విజయం సాధించినట్లు అధికారికంగా సంబంధిత అధికారులు ప్రకటించారు. ఇక మూడుచింతలపల్లిలో బిఆర్ఎస్ అత్యధికంగా మెజార్టీ స్థానాలు 14 కైవసం చేసుకోవటంతో బిఆర్ఎస్ అభ్యర్థులందరిని కూడ క్యాంపులకు తరలివెళ్లినట్లు సమాచారం. ఇదీ ఇలా ఉండగా 9స్థానాల్లో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ వారు కూడ క్యాంపులకు అభ్యర్థులను తరలించినట్లు తెలుస్తుంది. ఇక కేవలం ఒక స్థానంలో మాత్రం బిజెపి గెలుపొందటం జరిగింది. మూడుచింతలపల్లిలో బిఆర్ఎస్‌కు మెజార్టీ ఉండటంతో బిఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థిగా జాము రవిని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఏది ఏమైనా ఈ నెల 16వ తేదీన మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ పదవికి, వైస్‌చైర్మన్ పదవికి ఎన్నికలు జరుగనున్నాయి. ఒక వేళ ఏమైనా సమీకరణలు జరిగితే మాత్రం చైర్మన్ ఎన్నిక వరకు ఉత్కంఠ పరిస్థితి ఉంటుందని మాత్రం చెప్పవచ్చు.

# ప్రశాంతంగా పుర పోరు కౌంటింగ్


ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా


కౌంటింగ్ హాల్ నుండి బయటకు వస్తున్న విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థులు


విక్టరీ చూపుతున్న కాంగ్రెస్ అభ్యర్థులు

**కొడంగల్,ఫిబ్రవరి 13(ప్రభాతవార్త:** కొడంగల్ మున్సిపాలిటీగా ఏర్పడిన అరనంతరం రెండవ సారి పురపోరు ఎన్నికలు నిర్వహించారు.శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు నిర్వమించారు.పోలీసు బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు నిర్వహించారు.మొత్తం 12వార్డులకు గాను 11,565 ఓట్లుఉండగా 8760 మంది వేసిన ఓట్లను లెక్కించారు.6 టేబుల్స్‌లో 2 రౌండ్‌లలో ఓట్ల లెక్కింపు జరిగింది.మొదటి రౌండులో 1,2,3,7,10,11 వార్డులను లెక్కింపు ప్రారంబించారు.ఇందులో 1,4,7,10,11 వార్డులు కాంగ్రేస్ పార్టీ అభ్యర్ధులు గెలుపొందగా 2వ వార్డులో బీఆర్ఎస్ స్వల్ప మెజార్టీతో గెలుపొందింది.రెండవ రౌండు ఉత్కంఠభరితంగా కొనసాగింది.ఇందులో 3,5,6,8,9,12 వార్డులను లెక్కించారు.9వ వార్డు ఎంఐఎం అభ్యర్ధి గెలుపొందగా మిగితా 3,5,6,8,12 వార్డులు కాంగ్రెస్ అభ్యర్ధులు గెలుపొందారు.8,9వ వార్డుల్లో పోటీ ఉత్కంఠ భరితంగా కొనసాగింది.మొట్టమొదటి సారి ఎంఐఎం 9వ వార్డు కైవసం చేసుకోవడంతో పార్టీకి జీవం పోసినట్లయింది.గత ఎన్నికల్లో 4 స్దానాల్లో పోటీ చేసినా ఒక్కటి కూడా గెలువలేకపోయింది.ఈ ఎన్నికల్లో 2 స్దానాల్లో పోటీ చేసి ఒక స్దానం గెలుపొందడంతో పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు.

**ఆనందంతో కంట తడిపెట్టిన నాయకులు :**

పురపోరులో 8వ వార్డు నుండి పోటీ చేసిన శంకర్‌నాయక్ ఉత్కంఠ భరితానికి లోనైయ్యాడు.25 ఓట్ల మెజార్టీతో గెలుపొదడంతో సంతోషంతో కంటతడి పెడుతూ బయటకు వచ్చాడు.తాను నమ్ముకున్న వారే తన వెనకాల ఉంటూ గోతులు తవ్వారని అయినా దేవుడి ఆశీర్వాదంతో గెలుపొందానని అన్నారు.కొంతసేపు ఏడ్చినా అనంతరం అందరూ ఓదార్చడంతో సద్దుమణిగింది.అలాగే 12వ వార్డులో సుష్మ సైతం అనందంతో కంటతడి పెడుతూ బయటకు వచ్చింది.అమెకు కాంగ్రేస్ రెబల్ అభ్యర్ధితో పాటు మరో ఇద్దరు పోటీ ఉన్నా బయట పడ్డానని చెప్పుకొచ్చింది.పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.


బుగ్గాపూర్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో మాట్లాడుతున్న మండల విద్యాధికారి చంద్రప్ప.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

**మండల విద్యాధికారి చంద్రప్ప**

**కోట్‌పల్లి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల విద్యాధికారి చంద్రప్ప అన్నారు. శుక్రవారం నాడు వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని బుగ్గాపూర్ ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పరిశీలించి అలాగే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం మరియు వంటగదిని ,భోజనం నాణ్యత, పరిశుభ్రత వంట విధానాలను విద్యార్థులు హాజరు పట్టికపరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. పాఠశాలలో మొత్తం మూడు తరగతిగదులు ఉండగా ,విద్యార్థుల అభ్యాసం మరియు మౌలిక సదుపాయాలపై చర్చించడం జరిగిందన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగతుందని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచు మహేందర్‌రావు, ఉపాధ్యాయులు మల్లేశ్వరి, యాదయ్య, సిఆర్పి నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డును ఆక్రమించిన నిర్మాణాలపై ఫిర్యాదులు

-సిబ్బంది వైఖరిపై స్థానికుల నిరసన

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ బొక్కోనిగూడ పోచమ్మబస్తీలో భూపతి భరత్ ఇంటి ఎదురుగా రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నా అధికారులు ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదుదారులు కట్ట హరినాథ్‌రెడ్డి, జి.రాకేశ్‌కుమార్ యాదవ్, కె.శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. జిహెచ్ఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయం ప్రవేశద్వారం ముందు శుక్రవారం బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. శ్రీహరి అనే వ్యక్తి నిబంధనలకు విరుద్దంగా రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడని గత ఏప్రిల్ 29న ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌కు పోచమ్మబస్తీ వాసులు ఫిర్యాదు చేయగా ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గత జూన్ 2న, 16న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. దీంతో అప్పటి మున్సిపల్ కమిషనర్ ఇంటి యాజమానికి వివరణ కోరుతూ నోటీసు జారీ చేశారని గత జూలై 6న జేసీబీ సాయంతో అధికారులు ఇంటి బేస్‌మెంట్‌ను కూల్చివేశారని పేర్కొన్నారు. అయినప్పటికి నిర్మాణదారుడు శ్రీహరి ఇంటి నిర్మాణం పూర్తి చేసి బెస్‌మెంట్ కూల్చివేసిన చోట నుంచి తిరిగి రోడ్డును ఆక్రమించి ప్రహారిగోడ నిర్మాణం చేశారని ఈనెల 4న ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటి కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీసీ వాణి ఆదేశించినప్పటికి సిబ్బంది నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని కార్యాలయంలో సిబ్బంది అవినీతి, అలసత్వంతో ప్రజలకు జవాబుదారితనం లోపిస్తుందని ఆరోపించారు. ఈవిషయమై సంబంధిత సిబ్బందిని సంప్రదించగా నిర్లక్ష్యపు ధోరణితో మాట్లాడుతున్నారని హరినాథ్‌నాథ్‌రెడ్డి, రాకేశ్‌కుమార్ యాదవ్‌లు సిబ్బంది వైఖరిపై బైఠాయించి నిరసన తెలిపారు.


ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయ ద్వారం ముందు బైఠాయించిన హరినాథ్‌రెడ్డి, రాకేశ్‌కుమార్ యాదవ్

## మట్టి రోడ్డు పనులు ప్రారంభం

**జిల్లెడు చౌదరిగూడ,ఫిబ్రవరి 13,(ప్రభాతవార్త):** జిల్లేడు చౌదరిగుడా మండలంలోని చింతకుంట తండా గ్రామపంచాయతీ లో గల జెమ్లు తండా నుంచి వేపకుచ్చ తండా ఘనపూర్ జాకారం బిటి రోడ్డు వరకు దాదాపుగా 2 కి. మి వరకు మట్టి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ దేవీ రామ్ చరణ్ శుక్రవారం ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా తాండవాసులు రోడ్డు సౌకర్యం సరిగా లేక ఇబ్బందులు పడుతున్నందున వెంటనే మట్టి రోడ్డు పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదయ్య, వార్డు సభ్యులు గ్రామస్తులు ఉన్నారు.


మట్టి రోడ్డు పనులు చేయిస్తున్న సర్పంచ్ దేవి రామ్‌చరణ్

## పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

**జిల్లెడు చౌదరిగూడ,ఫిబ్రవరి 13,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. పాఠశాల పైకప్పు పెచ్చులు ఊడిపోయి కిందపడ్డ విషయం తెలుసుకున్న ఎంఈఓ పాఠశాలను సందర్శించి పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాల పైకప్పు పెచ్చులు ఊడిపోయిన విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్వేత, ఉప సర్పంచ్ బాల్‌రాజు, విజయలక్ష్మీ, రాములు తదితరులు ఉన్నారు.


పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి

## గత ప్రభుత్వం గ్రామాలఅభివృద్ధిని గాలికి వదిలేసింది

**సర్పంచ్ పట్లూరి హైమావతి జగదీశ్వర్**

**కేశంపేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :**

గ్రామల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో కొత్తపేట గ్రామ అభివృద్ధికి తన వంతుగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సర్పంచ్ పట్లూరి హైమావతి జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం గ్రామంలో గ్రామపంచాయతీ పాలక వర్గంతో కలిసి సర్పంచ్ హైమావతి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. 10 లక్షల వ్యయంతో మహిళా సమాఖ్య నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. 11వ వార్డ్‌లో, హాస్టల్ సముదాయంలో మంచినీటి కొరత తీర్చేందుకు నూతనబోరు మోటర్ లను ప్రారంభించారు. ఇందిరమ్మ కాలనీలో కల్వర్టు, 5వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామాలఅభివృద్ధిని గాలికి వదిలేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గ్రామాలలో అభివృద్ధి పనులు కళ్ళకు కట్టినట్లు కనబడుతున్నాయని, కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం పెద్దఎత్తున నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా రాణించాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. వచ్చే వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటు న్నామన్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం, ప్రజలందరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని సర్పంచ్ హైమావతి జగదీశ్వర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్నాటి దర్శన్, పంచాయితీ కార్యదర్శి జగన్, వార్డు సభ్యులు కాడెమోని జంగయ్య, పుట్నాల అనూష రాజు , అల్లే ప్రవల్లిక సంతోష్, పసుల స్వప్న నరేష్ యాదవ్, కుమ్మరి శేఖర్, కుంటి పద్మ లక్ష్మయ్య, నందిగామ శిరీష రాజు, కాకునూరు కృష్ణ, కంఠం యాదయ్య, చుక్క శ్రీను, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లూరి మహేశ్వర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు వట్టెల అంజయ్య యాదవ్, నాయకులు రంగు శంకర్, నిర్దవెళ్లి జంగయ్య, అల్లే గణేష్, పాలాది పెంటయ్య, కద్దాల శ్రీధర్, అన్నం గారి బాలరాజ్, వట్టెల రవి యాదవ్, సోడం పల్లి సంతోష్, క్యాతం మహేష్, పుట్నాల కృష్ణయ్య, పుట్నాల సురేష్, బాలరాజ్, దైవం, మహేష్, రాజు, నరేష్, యాదయ్య, ఆశీర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ హైమావతి జగదీశ్వర్ ,ఉపసర్పంచ్,కార్యదర్శి

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** 33 కెవి ఫీడర్లలో విద్యుత్ డిసిడబ్ల్యు పనులు, కరెంట్ తీగల కింద చెట్లకొమ్మలు తొలగిస్తున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఘట్‌కేసర్ విద్యుత్ ఏఈ బి.యశ్వంత్‌కుమార్ తెలిపారు. 11 కెవి శివారెడ్డిగూడ ఫీడర్ పరిధిలోని శివారెడ్డిగూడ, ఘణాపూర్, ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్, తహసీల్, జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయాలలో ఉదయం 10 గంటల నుంచి 11:30 వరకు, 11 కెవి ఘట్‌కేసర్ ఫీడర్ పరిధిలోని ఘట్‌కేసర్ పట్టణంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, 11 కెవి మాదారం ఎజిఎల్ ఫీడర్‌లోని మాదారంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు, రైతులు గమనించి తమకు సహకరించాలని ఏఈ సూచించారు.

## బిఆర్ఎస్‌కు విజయం అందించిన ప్రజలకు ధన్యవాదాలు

- రాష్ట్ర నాయకులు దండెం రాంరెడ్డి

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల్లో 24 వార్డులలో 13 వార్డులను గెలిపించి బిఆర్ఎస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ అందించిన పట్టణ ప్రజలకు పార్టీ రాష్ట్ర నాయకులు దండెం రాంరెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మరోసారి బిఆర్ఎస్ పార్టీపై విశ్వాసం ఉంచారని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల తమ మద్దతును ఓట్ల రూపంలో వ్యక్తం చేశారని అన్నారు. గెలిచిన కౌన్సిలర్లు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుని పారదర్శకంగా పనిచేయాలని సూచించారు.ఇబ్రహీంపట్నం అభివృద్ధికి కట్టుబడి ఉంటామని, మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా శ్రమించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తామని, ప్రతి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధి, శుభ్రత, తాగునీరు, రహదారుల అభివృద్ధిపై దృష్టి సారిస్తామని దండెం రాంరెడ్డి పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్ సొసైటీ ఫిర్యాదుతో అక్రమ నిర్మాణాలకు బ్రేక్

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్తః**

జూబ్లీహిల్స్‌లోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణం లో కొనసాగుతున్న నిర్మాణాలపై యథాస్థితి కొనసాగిం చాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో కొనసాగు తున్న అక్రమ నిర్మాణాలపై సొసైటీ అధ్యక్షుడు బొల్లినేని రవీంద్రనాథ్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. ఈ కేసులో సొసైటీ కోర్టు దృష్టికి పలు అంశాలను తీసుకువచ్చింది. ఇందులో భాగంగా 2017 లో లీజ్ గడువు ముగిసినప్పటికీ దాన్ని పొడిగించకపో వడం, చెల్లుబాటు అయ్యే ఎన్ఓసీ లేదా అమలులో ఉన్న లీజ్ ఒప్పందం లేకపోవడం, అనుమతులు మంజూరు చేసే ముందు సంబంధిత అధికారులకు అభ్యంతరాలు తెలియజేయడం తదితన అంశాలున్నాయి. విచారణ అనంతరం హైకోర్టు ఇచ్చిన యథాస్థితి ఉత్తర్వులు సొసై టీ హక్కులను పరిరక్షించడంతో పాటు, సొసైటీ పరిధి లో చేపట్టే అభివృద్ధి పనులు తప్పనిసరిగా చట్టబద్ధమైన విధానాలు, అనుమతులతోనే జరగాలని మరింత బలపరి చినట్లు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ తెలిపా రు. సొసైటీ ఆస్తుల పరిరక్షణ, చట్టపాలన, సభ్యుల సమిష్టి ప్రయోజనాల కోసమే తాము ఇది దాఖలు చేసినట్లు జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ నిర్వహణ కమిటీ స్పష్టం చేసింది. సంస్థ గౌరవాన్ని కాపా డేందుకు అవసరమైన అన్ని చట్టబద్ధ మార్గాలను అనుసరి స్తామని, కేసు పురోగతికి అనుగుణంగా తదుపరి సమాచా రం సభ్యులకు తెలియజేస్తామని రవీంద్రనాథ్ స్పష్టం చేశా రు. ఈ ఉత్తర్వులతో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణం లోని నిర్మాణాలపై తాత్కాలికంగా బ్రేక్ పడినట్లైంది.



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు.

## శామీర్‌పేటలో సిపిఐ సభ్యత్వ నమోదు

..ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

**శామీర్‌పేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**

శామీర్‌పేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల సిపిఐ కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్ ప్రారంభించారు. శుక్రవారం శామీర్‌పేటలోని పెద్దమ్మ కాలనీ వద్ద సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సిపిఐ కార్యదర్శి నరేంద్రప్రసాద్ మాట్లాడుతూ సిపిఐ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న రాజకీయ పార్టీ అని, సుధీర్ఘ పోరాటాలు చేస్తూ నిత్యం పార్టీ నిర్మాణాన్ని కొనసాగిస్తుందన్నారు. నిరుపేదల, కార్మికుల, రైతుల పక్షాన ఉద్యమాలు చేస్తూ సిపిఐ ముందుకు వెళుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. 800మంది వరకు మీ సేవా ద్వారా ఇళ్ల మంజూరు కోసం ధరఖాస్తులు చేసుకున్నట్లు, సమగ్ర సర్వేద్వారా ఇళ్ల స్థలాలు కావాలని ధరఖాస్తులు చేసుకున్న వారికి మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ పార్టీ సభ్యత్వాన్ని తీసుకుని ప్రజామద్దతును కూడ గట్టి ఉద్యమాలకు సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు డి.భూమయ్య, పుట్ట మనెమ్మ, గాయత్రి, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


శామీర్‌పేటలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన మండల సిపిఐ కార్యదర్శి

### పేదలకు మెరుగైన వైద్యం భారంగా మారింది : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సంజీవరెడ్డి నగర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**

సంజీవరెడ్డి నగర్ పరిధిలో పేద ప్రజలకు మెరుగైన వైద్యం భారంగా మారిందని మాజీ మంత్రి తలసాని శ్రీని వాస్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సనత్ నగర్‌లోని బీకే గూడలో గల సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ కార్యాలయంలో లయన్స్ క్లబ్, మాతా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య పరీక్ష శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యేకు బీపీ పరీక్ష నిర్వహించగా నార్మల్‌గా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పేద ప్రజలు చిన్న చిన్న అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వెళ్లినా పరీక్షల కోసమే వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఖరీదైన వైద్యం కారణంగా అనేకమంది ఆర్థిక ఇబ్బందుల తో సతమవుతూ చికిత్సకు వెనుకాడుతున్నారని అన్నా రు. ఇప్పటికే ఉన్న నిమ్స్, గాంధీ హాస్పిటల్, ఉస్మాని యా జనరల్ హాస్పిటల్లకు అదనంగా ఎర్రగడ్డ, అల్వాల్, కొత్తపేట ప్రాంతాల్లో నూతన ఆసుపత్రుల నిర్మాణం చేపట్టిన విషయాన్ని ప్రస్తావించారు. జిల్లాకు ఒక మెడిక ల్ కాలేజీ ఏర్పాటు చేసిన ఘనత కూడా కేసీఆర్ ప్రభు త్వానిదేనని పేర్కొన్నారు.స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయని, ప్రజలు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పార్టీ నాయకులు ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి రమాదేవి, కుసుమ విజయకుమారి, సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు దూబే, మాజీ అధ్యక్షుడు పార్థసారధి, మానిక్ రావ్ పాటిల్, బీఆర్ఎస్ సనత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు కరుణాకర్ రెడ్డి, గుడిగే శ్రీనివాస్ యాదవ్, అనంత రెడ్డి, రామ్ నివాస్ బన్సాల్, భద్రయ్య, కరీం లాలా, శేఖర్, హరిసింగ్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

## సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**సేవాలాల్ కేశంపేట మండల కమిటీ గౌరవ అధ్యక్షుడు జరుపల రాజు నాయక్**

**కేశంపేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**

ఫిబ్రవరి 15న నిర్వహించబోయే సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని సేవాలాల్ మహరాజ్ ఉత్సవ కమిటీ కేశంపేట మండలం గౌరవ అధ్యక్షుడు జర్పుల రాజు నాయక్ అన్నారు. శుక్ర వారం కేశంపేట మండల కేంద్రంలోని నిర్వహించిన సమావేశానికి మండల కమిటి అధ్య క్షుడు అధ్యక్షులు సబావట్ రుప్ల నాయక్. మరియు జరుపుల దాసు నాయక్. కట్రావత్ వీరేందర్ నాయక్. సర్పంచ్ రవీందర్ నాయక్. డిప్యూటీ సర్పంచ్ వి. రవి నాయక్. నానావత్ కుమార్ నాయక్. పి .అర్జున్ నాయక్. జర్పుల భాస్కర్ నాయక్. తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ సభ్యులు

## గ్రామ సభలో గందరగోళం

**బూతు మాటలు తిట్టి నన్ను అవమానపరిచారు**

**న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించిన ఎమ్మార్పీఎస్ నేత చెన్నగళ్ళ శ్రవణ్ కుమార్**

**నందిగామ, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రంలో ఈనెల 12వ తేదీన జరిగిన గ్రామసభలో లేనిది ఉన్నట్లుగా.. ఉన్నది లేనట్లుగా వాట్సాప్ గ్రూపులో పెట్టిన నందిగామ గ్రామానికి చెందిన ఓ విలేఖరి అత్యుత్సాహం పై ప్రశ్నిస్తే తనను అవమానపరిచారని నందిగామ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు చెన్నగల్ల శ్రవణ్ కుమార్ మాదిగ న్యాయం కోసం నందిగామ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈనెల 12న సర్పంచ్ కొమ్ము కృష్ణ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో సమస్యలపై మాట్లాడుతున్న సందర్భంలో వివాదం చెలరేగిందన్నారు. ఈ చర్చలో ఉన్నది ఉన్నట్లుగా తెలపకుండా అధికార పార్టీ మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని, ఈ విషయంపై తాను సదర్ రిపోర్టర్ ను ఫోన్లో ప్రశ్నిస్తే తనపై విరుచుకుపడ్డాడని, ఒక దశలో ఏం పీక్కుంటావో పీక్కోమని తనపై చులకన వ్యాఖ్యలు చేస్తూ ఫోన్లో బెదిరిస్తూ మానసికంగా ఇబ్బందులు గురిచేసారని సదరు బాధితుడు వీడియో, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంఘటన విషయమై పోలీసులను అడగగా ఎమ్మార్పీఎస్ నాయకుడు చెన్నగల్ల శ్రవణ్ కుమార్ ,రిపోర్టర్ రాజ్ కుమార్ పై ఫిర్యాదు చేసింది వాస్తవమేనని ఎస్సై కావలి యాదయ్య తెలిపారు.

## విద్యార్థులు ఇష్టంతో చదివినప్పుడే విజయాలు సాధిస్తారు : అభిషేక్ సింగంశెట్టి

**జీడిమెట్ల, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**

విద్యార్థులు కష్టపడకుండా ఇష్టంతో చదివినప్పు డే విజయాలు సాధిస్తారని అభిషేక్ సింగంశెట్టి పేర్కొన్నారు. శుక్రవారం అపు రూప కాలనీలోని భాగ్యలక్ష్మి కమిటీ హాల్‌లో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో 9వ, 10వ తరగతి విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు చెందిన సత్యవాణి విద్యా నికేతన్ హై స్కూల్, టీవీఆర్ మోడల్ హై స్కూల్ (చింతల్), బచ్పన్ ఒలింపియాడ్ చింతల్, టీవీఆర్ గీతాంజలి, బచ్పన్ ఆర్ఆర్ నగర్ విద్యార్థులు పాల్గొన్నారు. సైకాలజిస్ట్, మోటివే టర్ అభిషేక్ సింగంశెట్టి (పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్) విద్యార్థులకు ప్రేరణాత్మక ఉపన్యాసం అందించారు. టీవీఆర్ గ్రూప్ చైర్మన్ టీ. కోటి రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థుల మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తూ పోటీ ప్రపం చానికి సిద్ధం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాబోయే పదవ తరగతి పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో అభిషేక్ సింగంశెట్టి వివరించారు. లెర్నింగ్ లేకుండా ఎర్నింగ్ ఉండదని విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యసాధన కోసం కృషి చే యాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన పి.వి. సింధు ను ఉదాహరణగా తీసుకుని, క్రీడల్లో దేశానికి పేరు తీసుకు రావడమే కాకుండా చదువులోనూ రాణించి తల్లిదండ్రుల ఆశ యాలను నెరవేర్చిన విధానాన్ని వివరించారు. ఆమెను ఆద ర్శంగా తీసుకుని విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ముం దుకు సాగాలని పిలుపునిచ్చారు. కేవలం మార్కులకే పరిమితం కాకుండా జ్ఞానాన్ని సాధించాలనే తపన కలిగి చదివితే విజయం సాధ్యమని పేర్కొన్నారు. ఆకలితో ఉన్న పులి ఆహా రాన్ని వెతికినట్లు, బంగారు భవిష్యత్తును అందించే విద్యను సాధించాలని విద్యార్థులను ప్రేరేపించారు.



మోటివేషన్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులు


వార్షికోత్స కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మల్లేశం, ఎంఈఓ వెంకటేశ్వరరావు

## బాలికలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**బంట్వారం,ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** విద్యార్థుల భవిష్యత్తు పాఠశాల విద్యతో మొదలవుతుందని, జీవితంలో వివిధ రంగాలలో స్థిరపడడానికి పాఠశాల విద్య ఎంతగానో దోహదం చేస్తుందని బంట్వారం గ్రామ సర్పంచ్ దుర్గంచెరువు మల్లేశం అన్నారు. బంట్వారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో శుక్రవారం ఎస్ఓ శైలజ ఆధ్వర్యంలో వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ దుర్గం చెరువు మల్లేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ, గతంలో అమ్మాయిలను చదివించాలంటే ఎంతగానో ఆలోచించేవారని, వంటింటికే పరిమితం చేసేవారని అన్నారు. ప్రస్తుతం రాజకీయాలు మొదలు, అన్ని రంగాల్లో ఆడవారు రాణిస్తున్నారని అన్నారు. ఎంఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రాబోయే వార్షిక పరీక్షలలో 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మండలంలోనే మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా బస్వాపూర్ గ్రామ సర్పంచి స్రవంతి శివరాజ్ పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. పాఠశాల ఎస్ఓ శైలజ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ శైలజ, వార్డు మెంబర్ శాంతకుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక మాధ్యమాల్లో రైతు ఆవేదన

**యాచారం, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త:**

భూ సేకరణకు సహకరించాలి అని అంటున్న తహసీల్దార్ అయ్యప్ప ముఖ్యంగా ఆర్ డి వో అనంత రెడ్డి మీకు రైతుకు భూమికి ఉన్న అనుబంధం తెలుసా? సామాజిక వేత కలకొండ అంజయ్య ప్రశ్నించారు. శుక్రవారం సామాజిక వేదిక మాధ్యమంగా ఆయన మాట్లాడుతూ.. అధికారుల ఆదేశాల మేరకు భూసేకరణ అని చెప్పి మా యాచారం మండలం మొత్తానికి ఎసరు తెచ్చి పెట్టారనీ అన్నారు .ఇది మీకు న్యాయమే అనిపిస్తుందా? మీరు ఇస్తాఅంటున్న పరిహారంతో మాకు సరైన న్యాయం జరుగుతుందా? ఈనాటి మార్కెట్ విలువకు మీరు చెబుతున్న పరిహారానికి సంబంధం అసలు ఉందా! పూర్తిగా వ్యవసాయ ఆధారిత రైతుకుటుంబాలు ఉన్న మండలంలో భూములు లాగేసుకున్నాక రైతులు, రైతుకూలీలు వారి అనుబంధ వృత్తుల వారి జీవనోపాధి ఏం కావాలనీ తరతరాలుగా ఆ భూములనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారి పరిస్థితి ఏమిటి. నేటి సమాజంలో కాస్తో కూస్తో భూమి ఉన్న వాడికే కొంత విలువ ఉన్న మాట వాస్తవం కదా?, ఆ కుటుంబాలలో ఉన్న యువత భవిష్యత్తు అంధకారంలోకి పడిపోదా? నేడు ఆ కుటుంబాలలో పెళ్ళిళ్ళు కాని పిల్లల పరిస్థితి ఏలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు తెలిపారు. గతంలో ఫార్మా భూ సేకరణ చేసి 5 సంవత్సరాలు గడిచినా కనీసం ఇస్తామన్న ప్లాటు కాగితాలు ఉద్యోగాలు ఏమయ్యాయి అవన్నీ తెలిసి కూడా మళ్లీ భూ సేకరణ పేరుతో మమ్మల్ని మభ్యపెట్టి మోసం చేసి తీసుకోవడం మీకు తగునా అన్నారు.ఇలాంటి వాళ్ళకు వంత పడే నాయకగణం ఉన్నంత కాలం సామాన్య ప్రజలు ఇలా మోసపోతూనే ఉండాలా? రక్షించే వాడే భక్షిస్తుంటే అందరూ చూస్తూ మీనా మేషాలు లెక్కిస్తున్నారే తప్ప సరైన కార్యాచరణ ఆచరణలో కనిపించడం లేద ఆవేదన వ్యక్తం చేశారు.ఇవన్నీ తెలిసిన ఒక రైతు బిడ్డగా దయచేసి రైతు పక్షాన నిలబడండి అని



అలియాబాద్ మున్సిపల్‌లోని కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎన్నికల పరిశీలకులు నిర్మల కాంతి వెస్లీ,జిల్లా కలెక్టర్ మనుచౌదరి దృశ్యం

## జిల్లాలో మున్సిపల్ ఓట్ల లెక్కింపు పూర్తి..ప్రశాంతం

### మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి

..ఓట్ల లెక్కింపు కేంద్రాలను సందర్శించిన వైనం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాల్టీలు అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్‌లలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు కట్టుదిట్టంగా నిర్వహించినట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లాలోని ఆయా మున్సిపాల్టీల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు నిర్మలకాంతి వెస్లీతో కలిసి కలెక్టర్ మనుచౌదరి సందర్శించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కౌంటింగ్ సెంటర్లలోని స్ట్రాంగ్‌రూమ్‌లను తెరిచి అభ్యర్థుల, ఏజెంట్ల సమక్షంలో పోస్టల్ ఓట్ల లెక్కింపు, ఆ తరువాత బ్యాలెట్ బాక్స్‌లను తెరిచి బ్యాలెట్ ఓట్ల లెక్కింపు చేపట్టారు. లెక్కింపు ప్రక్రియ సిసి కెమెరాల పర్యవేక్షణలో గట్టి పోలీసు బందోబస్తు మధ్య ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండ బ్యాలెట్ లెక్కింపు చేపట్టినట్లు తెలిపారు. అలియాబాద్ మున్సిపాల్టీలో కాంగ్రెస్ 8స్థానాలు, బిఆర్ఎస్ 7స్థానాలు, బిజెపి 3 స్థానాలు, బిఎస్‌పి1, ఇండిపెండెంట్1 ఆయా అభ్యర్థులు గెలుపొందినట్లు తెలిపారు. మూడుచింతలపల్లిలో కాంగ్రెస్ 9, బిఆర్ఎస్ 14, బిజెపి 1, ఎల్లంపేట్‌లో కాంగ్రెస్ 8, బిఆర్ఎస్ 12, బిజెపి 4 స్థానాలను అభ్యర్థులు గెలుపొంది ఆయా పార్టీలు కైవసం చేసుకున్నాయి. గెలుపొందిన వారికి ఆయా మున్సిపాల్టీల్లో సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఎన్నికైన ధృవపత్రాలను అందజేశారు.

## తెలంగాణ సాహిత్యానికి కవి సిధారెడ్డి విశిష్ట సేవలు

బాలకృష్ణారెడ్డి



సదస్సు ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుకోవడంలో తోటి విద్యార్థులతో పోటీ కాక ప్రపంచ విద్యార్థులతో పోటీపడాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. ప్రపంచం ఇప్పుడు భారతదేశం వైపు చూస్తుందని 2047 నాటికి స్వతంత్ర భారతదేశ శతాబ్ది ఉత్సవాలల్లో వికసిత్ భారత్ కావాలంటే తల్లిదండ్రుల ఆశలను నిలబెట్టేందుకు సామాజిక బాధ్యతతో పనిచేయాలని ఆయన ఆకాక్షించారు.

జిహెచ్‌ఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అంకుశాపూర్ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, మహేంద్రాహిల్స్‌లో జరుగుతున్న 'డాక్టర్ నందిని సిధారెడ్డి సాహితి సమాలోచన' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలుగు బాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఇక్కడ రెండు రోజుల పాటు ఈసదస్సును నిర్వహించారు. సదస్సు ముగింపు కార్యక్రమానికి టిహెచ్‌ఈసి చైర్మన్ బాలకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి నందిని సిధారెడ్డి సాహిత్యానికి అందించిన సేవలను కొనియాడారు.

విశిష్ట అతిథిగా విచ్చేసిన తెలంగాణ శాసనమండలి సభ్యులు-రచయిత దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులను చూస్తే బతుకమ్మలతో నిండిన చెరువుగా కనిపిస్తుందని, నాగేటి చాల్లల్ల నాతెలంగాణ పాట పాడి వినిపించారు. తెలంగాణ సంస్కృతికి తొవ్వ నిర్మించిన కవి సిధారెడ్డి అని, తెలంగాణ జీవితపు లోతులు, బాషా సంస్కృతి ప్రజల భావోద్వేగాలు తెలియాలంటే, తెలంగాణ జీవితం అర్థం కావాలంటే సిధారెడ్డి కవిత్వం చదవాలన్నారు.

ఈకార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్నేహలత మాట్లాడుతూ సదస్సు ఇంత గొప్పగా అద్భుతంగా నిర్వహించినందుకు దానికి సహకరించిన బోధనా, భోధనేతర సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. రెండు రోజుల కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించినందుకు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ నాకవిత్వం నాఆత్మనున్యత భావాన్ని పోగొట్టుకోవడానికి రాయడం మొదలుపెట్టి తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికి నావంతు కృషి చేయడానికి కవిత్వం రాశానని, కవిత్వం రాస్తూనే ఉంటానని పేర్కొన్నారు.

తెలుగుబాషా చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బడేసాబ్ మాట్లాడుతూ సిధారెడ్డి కవిత్వంలో తెలంగాణ ఆత్మను పట్టుకున్నారని సాహిత్య సదస్సు నిర్వహించడంలో భాగస్వామ్యం అయినందుకు ఆనందంగా ఉందన్నారు. ముగింపు సదస్సులో నివేదికను శ్రీభాష్యం అనురాధ సమర్పించారు.

కార్యక్రమాన్ని సాంకేతికంగా ముందుండి నడిపించిన తెలుగు బాషా చైతన్య సమితి ప్రధాన సంపాదకులు డాక్టర్ వి.విజయప్రకాష్‌ను ఈసందర్భంగా సన్మానించారు.

తెలుగు బాషా చైతన్య సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎడ్ల కల్లేశ్, కార్యదర్శి ఎల్.జగన్, నాలేశ్వరం, శంకర్, గంటా మనోహార్‌రెడ్డి, కందుకూరు శ్రీరాములు, బాణాల భుజంగరెడ్డి, ప్రొఫెసర్ శ్రీదేవి, డాక్టర్ పెబ్బేటి మల్లిఖార్జున్‌లు మాట్లాడారు. సదస్సు రెండో రోజు 43 మంది సిధారెడ్డిపై వివిధ కోణాలలో విశ్లేషిస్తూ పత్ర సమర్పన చేశారు.

# శివయ్యపై రామబాణం



-శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం-గుడిలో ఏటా పెరుగుతున్న శివలింగం ప్రత్యేకత

-శివలింగాన్ని త్రేతాయుగంలో శ్రీరాముడు ప్రతిష్ఠించాడనే చరిత్ర

-మహా శివరాత్రికి ముస్తాబైన "రామేశ్వరం"

**షాద్‌నగర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :** సాక్షాత్తు లంకాధిపతి రావణాసురని సంహరించి సీతాసమేతంగా అయోధ్యకు తిరిగివెళ్తూ దండకారణ్య ప్రాంతమైన రామేశ్వ రంలోని బదిరీ వృక్షం కింద శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజ చేసారని ఆ శివలింగంపై రామబాణం నాటిచరిత్రకు సాక్షంగా నిలుస్తుంది. నాడు అతి చిన్నగా ఉన్న శివలింగం పరిమాణం ఏటా పెరుగుతూ.. భక్తులను పరమఆశ్చర్యానికి గురి చేస్తున్న ఎంతో మహిమాన్వితమైన శ్రీశ్రీశ్రీ రామ లింగేశ్వర దేవాలయం ఒక గొప్ప ఆధ్యాత్మిక ప్రదేశం. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజక వర్గం ఫరూక్‌నగర్ మండలం రామేశ్వరంలోని శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి దేవ స్థానంలోని శివలింగాన్ని త్రేతాయుగంలో శ్రీరాముడు ప్రతి ష్ఠించాడనే చరిత్ర చెబుతోంది. అంతేకాదు ఉత్తర రామేశ్వరంగా పిలిచే ఈ ఆలయంలో జోలెపట్టి వేడుకుంటే ఎంతటికష్టాలైనా తొలగి పోతాయని భక్తుల నమ్మకం. మహా శివరాత్రిని పురస్కరించుకొని ఇక్కడ జరిగే బ్రహ్మోత్సవాలు ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా అలరి స్తాయి. అనేక రాష్ట్రాల నుండి దేశ విదేశాల నుండి రామేశ్వరం దేవాలయం దర్శనం కోసం భక్త మహాజనం దర్శనానికి వస్తుంటారు.

**శ్రీరాముడే స్వయంగా ప్రతిష్టించిన లింగం..**

తెలుగు రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలోని రాయికల్ సమీపంలో రామే శ్వరం గ్రామంలోని శివాలయంలో ఉన్న లింగాన్ని త్రేతా యుగంలో సాక్షాత్తు శ్రీరాముడు ప్రతిష్ఠించినట్టుగా మాణిక్య ప్రభు చరిత్రలో పేర్కొన్నారు అందుకు గుర్తుగా శివలింగంపై రామబాణం గుర్తు ఉంటుంది. పంచముఖగుట్టపై వెలిసిన రామలింగేశ్వరుడిని స్వయంగా శ్రీ రామచంద్రుడే ప్రతిష్ఠించ డంతో ఈ ఆలయానికి ఎంతో విశిష్టత నెలకొంది. ఉత్తర రామేశ్వరంగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి ఘన చరిత్ర ఉంది. ఈ ఆలయంలోని శివలింగాన్ని సాక్షాత్తులంకాధిపతి రావణాసురని సంహరించి సీతాసమేతంగా అయోధ్యకు తిరిగి వెళ్తూ దండకారణ్య ప్రాంతమైన రామేశ్వరంలోని బదిరీ వృక్షం కింద శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజ చేసారని భక్తుల విశ్వాసం.

**ప్రతి ఏటా పెరిగే అద్భుత శివలింగం..**

ప్రకృతి వైపరీత్యాల వల్ల శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం అనేక వందల ఏళ్ల భూగర్భంలోనే ఉండిపోయి నట్టు చరిత్ర చెబుతుంది. రామేశ్వరం గుట్టల మధ్య మాణిక్య ప్రభువు శిష్యుడైన నరసింహారాయులు తపస్సు చేస్తుండుగా ఆయన కలలో రామలింగేశ్వరుడు దర్శన మిచ్చాడు. బదిరీ వృక్షం కింద శివలింగం ఉందనీ, దాన్ని బయటకు తీసి పూజలు నిర్వహించాలని ఆజ్ఞాపించి అంతర్థానమయ్యాడు. దీంతో ఆయన శివలింగాన్ని వెలికి తీసి ఆలయాన్ని నిర్మించి పూజలు నిర్వహించాడు. అనంతరం నరసింహారాయల శిష్యుడు అప్పకొండ భట్టు దత్తాత్రేయ స్వామి ఆలయం, కోనేరును నిర్మించి రామలింగేశ్వర దేవాలయ అభివృద్ధికి కృషి చేసినట్టు చెబుతారు. ఆలయంలోని శివలింగం ప్రతి ఏటా పెరుగుతుంది. దానికి నిదర్శనంగా శివలింగం చుట్టూ పగుళ్ల ఏర్పడుతున్నాయి. వాటిని ప్రతిఏటా పరమత్తులు చేస్తూ ఉంటారు.

**రామేశ్వరం శివయ్య సెంటిమెంట్..**

రామేశ్వరం దేవాలయం ఇక్కడి ప్రజలకు భక్తులకు ఎంతో సెంటిమెంట్‌గా భావిస్తారు. వివాహాలు ఇతర శుభ కార్యాలు ఇలాంటి పనులైన స్వామివారికి పూజ చేసిన అనం తరమే మొదలుపెడతారు. కొంతమంది ఇక్కడే తమ పిల్లల వివాహాలు చేస్తుంటారు. లేదా వివాహాలు అయిన వారిని స్వామివారి వద్ద నిద్ర చేయిస్తుంటారు. ప్రతి పున్నమికి ఇక్కడ పెద్దఎత్తున భజనలు పూజలు జరుగుతాయి. రాజ కీయనాయకులు కూడా స్వామివారి వద్ద తమ మొక్కులు విన్నవించుకుంటారు. అంతేకాదు నామినేషన్ల సమయంలో స్వామి వారివద్ద నామినేషన్ పత్రాలు పెట్టి ఆ త్వాత పూజ లు చేయించి నామినేషన్ దాఖలు చేస్తారు. రామేశ్వరం దేవా లయంలో ఇంకా అనేకసెంటిమెంట్లతో ఆధ్యాత్మికంగా పరిణ విల్లుతున్న ఈ ప్రాంతం రామేశ్వరం దేవాలయం ప్రసిద్ధి.

**శివరాత్రి బ్రహ్మోత్సవాలు**

ఫరూక్‌నగర్ మండలం రామేశ్వరంలో ఈనెల 11వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. 18వ తేదీ వరకు కొనసాగే ఈ బ్రహ్మోత్సవాలకు సంబంధించి మొదటి రోజు గణపతి పూజ, రుద్ర హోమం, ధ్వజారోహణం ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు ఉంటాయి. 12వ తేదీన శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వ హించనున్నారు. 13న నంది సేవ, అగ్నిగుండాలు తదితర కార్యక్రమాలు ఉంటాయి. 14న రుద్రాభిషేకం, విశేష అలం కరణ నిర్వహిస్తారు. 15వతేదీన మహాశివరాత్రిని పురస్కరిం చుకొని పెద్దఎత్తున కార్యక్రమాలు ఉంటాయి. 16న రుద్రహోమం పూర్ణాహుతి కార్యక్రమాలు ఏర్పాటు చేయ నున్నారు. 17వతేదీన ఉదయం 9గంటలకు శ్రీ రామ లింగేశ్వరస్వామి కళ్యాణోత్సవం జరుగుతుంది. 18న శివ తీర్థంతో కార్యక్రమాలు ముగుస్తాయని ఆలయ కార్యనిర్వ హణ అధికారి శివకుమార్ వెల్లడించారు. భక్తులు పెద్ద ఎత్తునహాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## నేటి నుంచి రావిర్యాలలో శివరాత్రి ఉత్సవాలు

**జిల్లెడు చౌదరిగూడ,ఫిబ్రవరి 13,(ప్రభాతవార్త):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని జిల్లేడ్ చౌదరిగూడెం మండలం రావిర్యాల గ్రామంలో గల శ్రీ సోమలింగేశ్వర స్వామి దేవాలయం మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.గంట మఠం విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం రోజు గణపతి పూజ,ధ్వజారోహన, అభిషేకం,ఆదివారం ఉదయం 6 గంటల నుండి ఒంటి గంటల వరకు స్వామి వారికి ప్రత్యేక అభిషేకములు, అనంతరం స్వామి వారి దర్శనం, సాయంత్రం ఉపవాస దీక్ష విరమణ, దేవత మూర్తుల విగ్రహం ఊరేగింపు, రాత్రి 11 గంటలకు భజన, లింగోద్భవ కార్యక్రమం, శివ పార్వతుల కల్యాణం, సోమవారం ఉదయం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుందని తెలిపారు., సోమవారం సాయంత్రం శకటోత్స వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పెర్కోన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని నిర్వహుకులు కోరారు.



శ్రీ సోమలింగేశ్వర స్వామి

## నేటి నుంచి మైసిగండిలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు



**కడ్తాల్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలో కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో ఋగ్వేద కాలం నాటి గంగా గుళ్ళుగా పిలువబడే ఆలయములే శివాలయ, రామాలయ ఆలయాలు వేల సంవత్సరాలు చరిత్ర కలిగిన ఆలయాల యందు అక్కన్న మాదన్న మహామంత్రులు గోల్కొండ నవాబుల కాలంలో విశేష పూజలు అందుకున్నట్లు చరిత్ర తెలుపుతుంది ఆ తరువాతి కాలంలో జీర్ణించుకుపోయిన ఈ క్షేత్రం మళ్లీ పూర్వ వైభవం కల్పించాలనే తపనతో ఆలయ పునర్నిర్మాణం పనులు చేపట్టి పూర్తి గావించి భక్తులకు ఉపయోగపడే విధంగా దివంగత ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ ఆర్. పంతు నాయక్ కృషి చేశారు. ఈ బ్రహ్మోత్సవాలు కొన్ని సంవత్సరాలుగా అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుంది. కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో శ్రీ మైసమ్మ దేవత శివాలయం, రామాలయం, దేవస్థానంలో ఈనెల 14 నుండి 16 వరకు శ్రీ శ్రీ శ్రీ కాశీ విశ్వనాథ స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మి శిరోలి పంతు నాయక్, ఈఓ స్నేహలతలు తెలిపారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. ఈనెల 14న శనివారం విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణం, రుద్రాభిషేకం, 15న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివపార్వతుల కళ్యాణ మహోత్సవం, స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు స్వామివారి రథోత్సవం ఉంటాయని వారు తెలిపారు 16న వసంతోత్సవం పూర్ణాహుతితో పాటు బ్రహ్మోత్సవాల్లో మూడు రోజులపాటు రుద్ర హోమం నవగ్రహ హోమం గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. భక్తులందరూ అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

## మున్నూరుకాపు సంఘం ఆద్వర్యంలో అన్నదానం

**కీసర,ఫిబ్రవరి13,ప్రభాతవార్త:**



కీసరగుట్టలో అన్నదానం చేస్తున్న మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు మహేందర్ పటేల్

కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు మున్నూరుకాపు సంఘం ఆద్వర్యంలో శుక్రవారం అన్నదానంను ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని డిఈఓ విజయకుమారి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు మహేందర్ పటేల్ ఆద్వర్యంలో భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.అన్నిదానాల్లోకెళ్లా అన్నదానం ఎంతో గొప్పదన్నారు.భక్తులకు ప్రతి ఏడాది ఉచితంగా అన్నదానం చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్,మున్నూరుకాపు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పురాతన దేవాలయం పునర్నిర్మాణం

**తలకొండపల్లి ఫిబ్రవరి 13,ప్రభాత వార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామంలో వెలసిన పురాతన శ్రీ రామలింగేశ్వర పర్వతవర్ధిని దేవాలయం పునర్నిర్మాణ పనులను పర్యవేక్షి స్తున్న గ్రామ సర్పంచ్ మాకం వీరేశలింగం, గ్రామ ప్రజలు,యువకులు, భక్తులు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన దేవాలయాన్ని ఎవ్వరు పట్టించుకోకుండా నిరక్ష ్యంగా వదిలి వేయడంతో దేవాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గ్రామానికి చెందిన మాకం అంజయ్య తండ్రి పెద్దవీరయ్య గారు దేవాలయం దుస్థితిని గమనించి పునర్నిర్మాణం కొరకు ముందుకు వచ్చారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో శివపార్వతుల



దేవాలయం పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ వీరేశ్ లింగం

కల్యాణమహోత్సవాన్ని జరిపించేందుకు ముందుకు వచ్చారు. అంజయ్య కు గ్రామ సర్పంచ్ మాకం వీరేశలింగం,గ్రామ ప్రజలు,యువకులు, భక్తులు సహాయ సహకారాలు అందించేందుకు పూనుకున్నారు. ఏది ఏమైనా పురాతన దేవాలయం పునర్నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో ప్రజలు సంతోషాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఆలయ పునర్నిర్మాణంలో తమ వంతు సహాయం అందించడానికి ముందుకు వస్తున్నారు. ఆదివారం 15/02/2026 ఉదయం 11.35 గంటలకు జరిగే స్వామివారి కల్యాణమహోత్సవంలో ప్రజలు, భక్తులు,యువకులు పాల్గొని విజయవంతం చేయాలని గ్రామ సర్పంచ్ మాకం వీరేశలింగం ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రేపు మహాశివరాత్రి.. శైవక్షేత్రాలలో ఏర్పాట్లు

-నేడు శివారెడ్డిగూడలో స్వామి కళ్యాణం

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** మహాశివరాత్రి సందర్భంగా ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని పలు శైవక్షేత్రాలను ముస్తాబు చేస్తున్నారు.



శివారెడ్డిగూడలోని శ్రీప్రసన్నవీరాంజనేయ మల్లిఖార్జునస్వామి దేవాలయం

శివరాత్రి రోజున భక్తులు శివాలయాలకు వస్తుండటంతో మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయకమిటీల సభ్యులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాలయాలకు రంగులు వేసి మామిడి తోరణాలు, వివిధ రకాల పూలు, విద్యుత్‌దీపాలతో అలంకరిస్తున్నారు. ఆదివారం శివరాత్రి పర్వదినం కాగా ఉపవాసదీక్షలు చేసి శివలింగాలకు భక్తులు అభిషేకాలు, అర్చన పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పండుగకు అవసరమైన పూజా సామాగ్రి, వివిధ రకాల పండ్లను కొనుగోలు చేస్తున్నారు. ఘట్‌కేసర్‌లోని శ్రీహరిహార భవానిక్షేత్రం, లింగాలకుంట శ్రీస్వయంభూ నాగలింగేశ్వరస్వామి, శివారెడ్డిగూడ శ్రీదండ్లగడ్డ ప్రసన్నవీరాంజనేయ-మల్లికార్జునస్వామి, ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శ్రీవిశ్వే శ్వరగిరిక్షేత్రం, కొండాపూర్‌లోని శివాలయం, ఎదులాబాద్‌లోని శ్రీభమ రాంభికామల్లికార్జునస్వామి, అంకుశాపూర్‌లోని శ్రీశివపంచాయతన స్పటిక లింగేశ్వరస్వామి ఆలయం, అవుషాపూర్‌లోని పంచాయతన సహిత శ్రీఉమామహేశ్వరస్వామి ఆలయాలలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శివారెడ్డిగూడలోని శ్రీదండ్లగడ్డ ప్రసన్నవీరాంజనేయ-మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం 5 గంటలకు శ్రీభమరాంభ మల్లిఖార్జునస్వామి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కొంతం రాంరెడ్డి తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు అభిషేకం అనంతరం మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చన, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అర్చన, రాత్రి 11:45 గంటలకు లింగోద్భవకాల అభిషేకం జరుగుతుందని తెలిపారు. ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శ్రీరాజరాజేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామి (హరిహారక్షేత్రం) దేవస్థానంలో ఆదివారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రుద్రాభిషేకాలు, ఉదయం 9 గంటలకు రుద్రహోమం, లక్షబిల్వార్చన, రాత్రి 10 గంటలకు పార్వతీ కళ్యాణం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం (లింగోద్భవకాలము) జరుగుతుందని శ్రీవిశ్వేశ్వరగిరి పీఠాధిపతి ఆత్మానందభారతీస్వామి తెలిపారు. శివరాత్రి సందర్భంగా పట్టణంలో పలు చోట్ల పండ్ల దుకాణాలు వెలిశాయి.

# పోలేపల్లికి పోటెత్తిన జనం



అమ్మవారి ఊరేగింపు(సిడే) కు తరలివచ్చిన భక్తులు

-సిడే పై ఊరేగిన జగజ్జనని...

-భక్తజన సందోహంగా మారిన పోలేపల్లి ఎల్లమ్మ ఆలయ ప్రాంగణం

**దుద్యాల్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** పోలేపల్లి ఎల్లమ్మ జాతరకు భక్తులు శుక్రవారం పోటెత్తారు. శివసత్తుల పూనకాలు...జోగు డప్పుల నాదాలు..కోడిపుంజుల బోనాలతో ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంగా మారింది. భక్తుల కోనేటి స్నానాలు..నారికేళ నైవేద్యాలు, ప్రత్యేక పూజలతో మండలంలోని పోలెపల్లి ఎల్లమ్మ ఆలయ ప్రాంగణం శుక్రవారం భక్తజన సంద్రంగా మారింది. పేదల ఆరాధ్య దైవం పోలేపల్లి రేణుక ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రధాన ఘట్టమైన సిడే కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఉయ్యాలలో ఉంచి 30 అడుగుల ఎత్తులో ప్రదక్షిణలు చేయించారు. ఎల్లమ్మ మాతాకి జై.. మావురాల ఎల్లమ్మ మాపై కరుణ చూపమ్మ. అంటూ భక్తులు సిడే పై గువ్వల బండారు చల్లుతుండగా జగజ్జనని ఆలయ మాడ వీధుల్లో ఊరేగింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న భక్తులు సాయంత్రం సిడే కార్యక్రమాన్ని తిలకించారు. ప్రత్యేక బస్సులు, ప్రైవేటు వాహనాల్లో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.



పూనకంతో ఊగిపోతున్న శివ సత్తులు



భద్రకాళి అమ్మవారి వేషధారణలో భక్తుడు

**అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..**

-శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తిరుపతిరెడ్డి, వికారాబాద్, నారాయణపేట్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లు రాజేష్ రెడ్డి, వార్ల విజయ్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ ముచ్చటి వెంకటేష్, ఈవో రాజేందర్ రెడ్డి, సర్పంచ్ జింకలి చంద్రయ్య, సంజీవరెడ్డి, నాగులపల్లి నరేందర్, కిష్టప్ప, రఘువర్ధన్ రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పరిగి డిఎస్పి శ్రీనివాస్ తో పాటు ఆరుగురు సిఐలు, 15 మంది ఎస్సైలు, 280 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సై శ్రీశైలం తెలిపారు.

**-ఆలయానికి అమ్మవారి వేంచేంపు కార్యక్రమం..**



అమ్మవారిని దర్శించుకున్న సిఎం సోదరుడు తిరుపతిరెడ్డి

ఉత్సవాల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి 11 గంటలకు అమ్మవారి వేంచెంపు కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వీధుల్లో అమ్మవారిని ఊరేగించి ఆలయానికి తీసుకొచ్చారు. శుక్రవారం సాయంత్రం జల్ది కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగహాన్ని ఆలయం చుట్టూ ఐదుసార్లు పల్లకిలో ఊరేగించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం